KLV A102 M322

రిపోర్టులు, రచనలు పంపవలసిన చిరునామా :
ఎడిటర్
ప్రజాపంథా
ఇం.నెం. 2-1-716 (B-6, F-4)
ఎస్వీఎస్ స్కూలు ఎదురుగా, ఓ.యు. మెయిన్ రోడ్, విద్యానగర్
హైదరాబాద్ - 500 044. ఫోన్ : 040 - 27668471
e - mail: prajapandha2013@gmail.com

ప్రజాపంథా

సి.పి.ఐ (ఎం.ఎల్) - న్యూడెమోక్రసీ పక్షపత్రిక

సంపుటి : 30 సంచిక : 13 15-01-2014 పేజీలు : 12 ప్రచురణ స్థలం : హైదరాబాద్ వెల : 10/-



విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణంకై అంకితమవుదామనీ, శాస్త్రీయ విద్యా సాధన కోసం పోరాడుదామనీ ప్రతినబూనిన

పిడియస్‌యు రాష్ట్ర 19 వ మహాసభ

విప్లవ విద్యార్థి ఉద్యమ అగ్రపతాక పిడియస్‌యు ను సమున్నతంగా నిలబెడతామంటూ, ఉద్యమ నిర్మాణానికి పునరంకిత మవుతూ 2014 జనవరి 3,4,5 తేదీలలో వరంగల్‌లో జరిగిన పిడియస్‌యు రాష్ట్ర 19వ మహాసభలు దిగ్విజయంగా జరిగాయి. పిడియస్‌యు సంస్థాపకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి, పిడియస్‌యు నిర్మాత కామ్రేడ్స్ జె.సి.యస్ ప్రసాద్, దుస్సా చేరాలు, కోలా శంకర్‌ల త్యాగాల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని కొనసాగిస్తామని, శాస్త్రీయ విద్యాసాధనకై తుదికంటా పోరాడ తామని మహాసభ పునరుద్ఘాటించింది.

పిడియస్‌యు రాష్ట్ర 19వ మహాసభలను తెలంగాణాలో రెండవపెద్ద నగరమైన వరంగల్‌లో జరపాలని పిడియస్‌యు రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. మహాసభల సన్నాహక కృషిలో భాగంగా 3 డిశంబర్ 2013న వరంగల్‌లో ఆహ్వానసంఘం ఏర్పడింది. కాకతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి అధ్యక్షు రాలుగా, వరంగల్ జిల్లా ప్రజాస్వామిక వాదులు, విద్యావేత్తలు, ప్రముఖులతో దాదాపు 200మందితో ఆహ్వాన సంఘం ఏర్పడింది.

రాష్ట్ర మహాసభల సందర్భంగా వరంగల్ నగరంలో విస్తృతంగా గోడరాతలు, ఎర్రటి తోరణాలతో, 20వేల పోస్టర్స్‌తో ప్రచారం చేశారు. మహాసభల ఏర్పాట్లలో భాగంగా వరంగల్ జిల్లాలోని పూర్వవిద్యార్థులతో అలయ్-బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. పిడియస్‌యు మాజీ రాష్ట్రనాయకులు కామ్రేడ్స్ బండి కోటేశ్వరరావు, చంద్రమౌళి, మైస శ్రీనివాస్, రవి, జీవన్, నాగభూషణం, మండల వెంకన్న తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అరుణారుణ రంజితమయిన వరంగల్ కదంతొక్కిన విద్యార్థులు :

2014 జనవరి 3 ఉదయం సూర్యుడి వెలుగుతో కాదు, ఇతర జిల్లాల నుండి వేకువజామునుండే నగరానికి చేరుకుంటున్న విద్యార్థుల ఉత్తేజకరమయిన నినాదాలతో వరంగల్ మేల్కొంది. చిత్తూరు మొదలు శ్రీకాకుళం వరకు, ఆదిలాబాద్ మొదలు మహబూబ్‌నగర్ వరకు విద్యార్థులు వరంగల్‌కు ఉక్కుపిడికిలి ఎత్తి కదిలారు. ఉదయం 5గం॥లనుండి 10గం॥ల వరకు వేలాదిగా విద్యార్థులు చేరుకుంటూనే ఉన్నారు. ఉదయం 11గం॥లనుండి వరంగల్ జిల్లా విద్యార్థుల చేరికతో పబ్లిక్‌గార్డెన్స్ నుండి ప్రారంభమైంది ప్రదర్శన కాదు, ఎర్రని దండు అన్నట్లుగా వరంగల్ రోడ్లన్నీ ఎరుపురంగు పులుముకున్నాయి. "జోహార్ అమరవీరులకు, పిడియస్‌యు జిందాబాద్, ప్రతిఘటిద్దాం సామ్రాజ్యవాద విద్యనూ, జార్జిరెడ్డికి లాల్‌సలాం, జంపాలకు లాల్‌సలాం, సాధిద్దాం శాస్త్రీయ విద్యా విధానం, విదేశీవిద్యాలయాను ప్రతిఘటిద్దాం" అంటూ విద్యార్థులు నినాదాలిస్తూ కదులుతుండగా పిడియస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్స్ రామకృష్ణ, కె.మల్లిక్, ఉపాధ్యక్షులు ఎ.డి.రాము, పి.నర్సయ్య, యు.గనిరాజు, సహాయకార్యదర్శులు కా॥ బి.నరసింహారావు, బి.కిరణ్, ఇ.నాగభూషణం, కోశాధికారి ఎన్.భానుచందర్, రాష్ట్రనాయకులు కామ్రేడ్స్ రవీందర్, పరుశు రాం, పవన్, శంకరిసత్యం, బి.రవిచంద్ర, విజయ్‌కన్నా, శ్రీశైలం, రాకేష్, మంజుల, రాజశేఖర్, గోవింద్, సైమన్ తదితరులు ప్రదర్శనకు నాయకత్వం వహించారు.

అరుణోదయ కళాకారులు డప్పునృత్యాలతో, గొంగడి వేషధా రణలతో విప్లవగేయాలలపిస్తూ ప్రదర్శనకు ముందుభాగాన నడిచారు. ప్రదర్శన పబ్లిక్ గార్డెన్స్‌నుండి హన్మకొండలోని ఆర్ట్స్ & సైన్స్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకుని అక్కడ బహిరంగ సభగా మారింది.

విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడండి!

- ప్రొ॥ కోదండరాం పిలుపు

విద్యార్థి మహాప్రదర్శన అనంతరం బహిరంగసభ ప్రారంభమ యింది. బహిరంగసభలో ముఖ్య అతిధిగా తెలంగాణ - జేఏసీ ఛైర్మెన్ ప్రొ॥ ఎం. కోదండరాం మాట్లాడుతూ 'విద్యారంగాన్ని మొదట వ్యాపారమయం చేసింది ఎన్‌టిఆర్' అని అన్నారు. విద్యావ్యా పారానికి వ్యతిరేకంగా పిడియస్‌యు సమరశీల పోరాటాలను చేసిందన్నారు. తెలంగాణా రాష్ట్రసాధన సాకారం మరికొద్ది రోజుల్లో ఫలించబోతుండగా కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్, చంద్రబాబులు విషనాగుల్లా బుసలుకొడుతూ బిల్లుకు అడ్డుపడుతున్నారన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా 23వరకేనని, ఆ తర్వాత అంపైర్ వికెట్‌లు, బాల్స్ తీసుకెళ్లాడని, సమయం ప్రకారం బంతులు వేయకపోతే జరిమానా వేసినట్లుగానే, సమయానికల్లా బిల్లుపై అభిప్రాయాలు చెప్పకపోతే కిరణ్, జగన్, బాబులకు ప్రజలు జరిమానా విధిస్తారన్నారు, తెలంగాణ పునర్నిర్మాణంకై విద్యార్థులు కదలిరావాలని కోరారు.

పి.వో.డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు కా॥వి.సంధ్య మాట్లాడుతూ, విద్యార్థినిలపై, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, హింసలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణం కోసం పీడీయస్‌యు మరింత శక్తివంతంగా పోరాడాల్సిన అవసరముందని గుర్తు చేశారు.

→

సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర నాయకులు కా॥ సాధినేని వెంకటేశ్వరరావు, మాట్లాడుతూ తమ నెత్తుటి త్యాగాలతో జార్జి, జంపాల, శ్రీహరిలు బిగిపిడికిలి జెండాను ఎరుపెక్కించారన్నారు. వీరి ఆశలకు. ఆశయాలకనుగుణంగా విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని సమరశీలంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు.

పిడియస్‌యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కా॥కె.మల్లిక్ మాట్లాడుతూ. శాస్త్రీయ విద్యా సాధనకోసం విద్యార్థిలోకం ఉద్యమించినప్పుడే సమాజంలోని సకల చెడుగులను రూపుమాపగలుగుతామన్నారు. విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి పిడికిళ్ళెత్తి పోరాడాలన్నారు.

ఇంకా ఈ సభలో టిఎన్‌జిఓ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీ కారెం రవీందర్‌రెడ్డి. సి.పి.ఐ.(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి కా॥ మండలవెంకన్న సి.పి.ఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకులు కా॥ కె. గోవర్ధన్. పీడీయస్‌యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు కా॥ ఎం.శ్రీనివాస్ తదితరులు ఉపన్యసించారు.

అరుణోదయ కళాకారుల విప్లవగేయాలు విద్యార్థులను ఉత్తేజపరిచాయి. మ॥ 1గం॥కు ప్రారంభమైన బహిరంగసభ సా॥ 5గం. వరకు జరిగింది. విద్యార్థులు అత్యంత క్రమశిక్షణతో బహిరంగసభను జయప్రదం చేశారు.

బిగిపిడికిలి జెండా ఆవిష్కరణ

4న ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందుగా పిడియస్‌యు బిగిపిడికిలి అరుణపతాకాన్ని అధ్యక్షులు కా॥ఎం. రామకృష్ణ ఆవిష్కరించారు. సభాప్రాంగణంలో నిర్మించిన అమర వీరుల స్థూపానికి సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్రనాయకులు. పిడియస్‌యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు కా సాధినేని వెంకటేశ్వరరావు. పిడియస్‌యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు, సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పిడియస్‌యు మాజీ రాష్ట్రనాయకులు. సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కా॥కె.గోవర్ధన్, పీడీయస్‌యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు కామ్రేడ్స్ ఎం.శ్రీనివాస్. సి.ఎస్.సాగర్, వరంగల్ జిల్లా పూర్వవిద్యార్థి నాయకులు కా॥బండి కోటేశ్వరరావు, పివోడబ్ల్యూ రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ బి.పద్మ, పివైఎల్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్స్ లావుడ్య రాజు, లింగ్యా, ఏఐకెఎంఎస్ నాయకులు కామ్రేడ్స్ దేశెట్టి రామచంద్రయ్యా, కోడిసోమన్న, ఏపిటిఎఫ్ నాయకులు మైస శ్రీనివాస్, అరుణోదయ కళాకారులు జనార్ధన్, అంజయ్యా, నిర్మల, వేణు, రమ, ఝాన్సీ, భీమశంకర్, పాపయ్యలు నివాళులు అర్పించారు. 'బిగియించిన పిడికిలే పిడియస్‌యు చిహ్నం' గేయం సభ ప్రాంగణంలో మారుమ్రోగింది.

మహాసభను ప్రారంభించిన ప్రొఫెసర్ హరగోపాల్

అనంతరం ప్రతినిధులసభలో ఆహ్వానసంఘ అధ్యక్షురాలు ప్రొ॥ జ్యోతిరాణి తొలిపలుకులు పలకగా ప్రధానకార్యదర్శి కా॥ మల్లిక్ సంతాపతీర్మానం ప్రవేశపెట్టారు. మహాసభ 2ని॥లు మౌనం పాటించింది. ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రొ॥ హరగోపాల్ గారు మహాసభను ప్రారంభిస్తూ అవకాశమివ్వడం సంతోషమన్నారు.

మతోన్మాదులు విజృంభిస్తున్న వేళ నూతన సమాజాన్ని కోరుకునే శక్తులు బలోపేతం కావాలన్నారు. మతతత్వం గురించి మాట్లాడకుండా సంస్కృతి గురించి మాట్లాడలేం. సామ్రాజ్య వాదానికి, భూస్వామ్యానికి జరిగిన సంపర్కం వల్ల విషసంస్కృతి భిన్నరూపాలలో ఉంది. స్త్రీ, పురుషుల స్థాయిలో మహిళా స్థానాన్ని బట్టి నాగరికత ఎక్కడ ఉందో చెప్పవచ్చు. దీనికి మూలాలు భూస్వామ్య విధానంలోనే ఉన్నాయి. నేటి విద్యావిధానం కూడా భూస్వామ్య, పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు రక్షించేదిగా ఉందన్నారు. ప్రొఫెషనల్ కోర్స్‌లలో అత్యంత ప్రతిభ కలిగిన విద్యార్థులు సామ్రాజ్యవాదానికి ఊడిగం చేస్తున్నారన్నారు. మోడీ, రాహుల్‌లు ఎవరైనా వారి విధానాలకు తేడాలేదు. విద్యాప్రపంచీకరణ, ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలన్నారు.

విద్యాగోష్టి

విద్యాగోష్టిలో భాగంగా **కొత్తరాష్ట్రాలు-విద్యారంగ సమస్యలపై** వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా విద్యారంగ సమస్యలపై పోరాడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలైనా విద్యారంగ సమస్యలలో, సంస్కృతిలో ఆర్థిక వ్యవస్థలో తేడా ఉందన్నారు. తెలంగాణా వచ్చినంత మాత్రానా విదాయరంగంలో సమూల మార్పులు రావన్నారు. శాస్త్రీయ విద్యా విధానసాధనకై ఉద్యమించే మనం వలస పాలకులకు అనుగుణంగా ఉన్న విద్యారంగాన్ని మార్చాలి. మార్కెట్ అవసరాల కోసం కార్పోరేట్ ఉద్యోగులను తయారు చేస్తోందీ విద్యా విధానం. 1966లో వేసిన కొఠారి కమీషన్ సిఫారసులు నేటికీ అమలు కాలేదన్నారు. నేడు తెలంగాణాలో 23% అక్షరాస్యత ఉంది. బోర్డులు చదవడం సంతకం మాత్రమే వచ్చిన వారు 60% మంది ఉన్నారు. దీనిని కూడా ప్రభుత్వం అక్షరాస్యతగా పేర్కొంటుంది. ప్రతి పల్లెల్లో బడికోసం ప్రగతిశీల శక్తులు ఉద్యమించాలన్నారు. రాబోయే తెలంగాణాలో కూడా పార్యప్రణాళికలు మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

ఉన్నత విద్యారంగం-ప్రపంచీకరణ అంశంపై ఏపిటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఏ.నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో మౌలికమైన మార్పురావాల్సిన అవసరం ఉంది. పెట్టుబడులకు, వస్తువులకు ఆకాంక్షలు లేకుండా అమ్మకోవడమే ప్రపంచీకరణ అనీ, అన్ని రంగాలలో ఉన్న ఆకాంక్షలను తొలగించడమే సరళీకరణ అని, ఉత్పత్తి రంగంలో వస్తూత్పత్తిని ప్రభుత్వం కాకుండా ప్రైవేటుగా ఉత్పత్తి చేయడమే ప్రైవేటీకరణ అన్నారు. భారతదేశంలో బిర్లా,అంబానీలు 2000 సంవత్సరంలో విద్యను ప్రైవేటీకరణ చేయాలని అద్వానీకి నివేదికనిచ్చారు. విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలు పెరగాలనే పేరుతో పోటీ పెరగాలంటూ విదేశీ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ఈ దేశంలో స్థాపించడానికి యూపిఏ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. విద్యారంగం మొత్తం ప్రభుత్వరంగంలో ఉండాలి. అప్పుడే సరైన విద్యను బోధించడానికి అవకాశం ఉంటుంది. ఉన్నతవిద్యకు 46000కోట్లు కేటాయించి కేవలం 13వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. దీని వల్ల వీరి చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుంది. ఆర్థిక భావదారిద్ర్యం ఉండే అభివృద్ధి జరగదు. సామ్రాజ్యవాదాన్ని పారద్రోలాలంటే పోరాటాలే మార్గమన్నారు.

సామ్రాజ్యవాద విషసంస్కృతి-కర్తవ్యాలు అంశంపై తెలంగాణా రచయితల వేదిక అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రగతిశీలశక్తులు బలపడాల్సిన సమయమిది అన్నారు. ప్రగతిశీల శక్తులు బలంగా ఉన్నారు విద్యార్థినీలకు ఎంతో రక్షణ ఉండేదన్నారు. 40సంవత్సరాలు పిడియస్‌యు చేసిన పోరాటాలు సంచలనాత్మకమైనవి. హాస్టల్ విద్యార్థుల సమస్యలపైన విద్యార్థినీలపైన జరిగిన అత్యాచారాలు విషయంలో పిడియస్‌యు చేసిన పోరాటాలు ఎంతో ప్రాముఖ్యమైనవి అన్నారు. నేడు విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్‌లలోనే గడుపుతున్నారన్నారు. విద్యార్థులకు తమ సమస్యలు కోసం కూడా స్పందించే గుణం కోల్పోతు న్నారన్నారు. ఈ సామ్రాజ్యవాద సంస్కృతిని తరిమికొట్టాలంటే బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం "ఉన్నతవిద్య - వ్యాపారీకరణ" అనే పుస్తకాన్ని సెంట్రల్ యూనివర్శిటీ ప్రొపెసర్ హరగోపాల్, "విద్యాహక్కు చట్టం ఎవరికోసం" అనే పుస్తకాన్ని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, విద్యార్థి సంఘం నిర్మాణం - పనిపద్దతులు అనే పుస్తకాన్ని జూలూరు గౌరీశంకర్ లు ఆవిష్కరించారు.

అనంతరం పిడియస్‌యు రాష్ట్రకార్యదర్శి రాష్ట్రఉద్యమ నిర్మాణ సమీక్షను ప్రవేశపెట్టగా మహాసభ ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యదర్శి నివేదికలో ప్రదానంగా విప్లవ దృక్పధాన్ని కాపాడటానికి, పరిరక్షించడానికి కార్యచరణను మహాసభ కర్తవ్యాలను రూపొందించుకోవాలని విప్లవవిద్యార్థి ఉద్యమ నిర్మాణమే గీటురాయిగా కార్యక్రమాలుండాలని పేర్కొంది. ఇప్పటివరకు సంఘంలో నెలకొన్న మితవాద ధోరణులను మహాసభ తిరస్కరిస్తూ తీర్మానించింది. మితవాద నాయకత్వం నుండి వేరుచేసుకుంటూ నూతన కర్తవ్యాలను రూపొందించు కోవాలని మహాసభ తీర్మానించింది.

"**ప్రణాళిక - నిబంధనావళి**"ని మహాసభ ఆమోదించింది.



మహాసభలు విజయవంతం కావాలని సి.పి.ఐ.(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రకార్యదర్శి కా॥చంద్రం పంపిన సందేశాన్ని రాష్ట్రనాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు చదివి వినిపించగా ప్రతినిధులు హర్షధ్వానాలు ప్రకటించారు.

రాబోయే రెండు సంవత్సరాలకు రాష్ట్రవిద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించేందుకు నూతన రాష్ట్రకార్యవర్గాన్ని మహాసభ ఎన్నుకొంది.

నూతన కార్యవర్గం

రాష్ట్ర అధ్యక్షులు : ఎం.రామకృష్ణ (సెంటర్)

ఉపాధ్యక్షులు : పి.నర్సయ్య (నిజామాబాద్)

: ఎ.డి.రాము (హైదరాబాద్)

: యు.గనిరాజు (తూ॥గో॥జిల్లా)

ప్రధాన కార్యదర్శి : కె.మల్లిఖార్జున్ (సెంటర్)

సహాయ కార్యదర్శులు : బి.నరసింహారావు (వరంగల్)

: బి.కిరణ్ (నల్గొండ)

: ఇ.భూషణం (ప॥గో॥జిల్లా)

కోశాధికారి : శంకరి సత్యం (అదిలాబాద్)

సభ్యులు : రవీందర్ (నిజామాబాద్). కె.సురేష్, జె.సమత, పి.దాసు (కరీంనగర్. ఆదిలాబాద్), బి.రవిచంద్ర, విజయ్‌కన్నా, శ్రీశైలం (వరంగల్), పరుశురాం (హైదరాబాద్), రాకేష్. మంజుల. భానుచందర్(ఖమ్మం), ముత్యాలు (నల్గొండ), ఎం.పవన్, మహేష్ (మహబూబ్‌నగర్). వినోద్, మల్లిక (శ్రీకాకుళం), పి.అశోక్, ఎ.సిద్దు (తూ॥గో॥), డి.గోవిందు(ప॥గో॥), పాండురంగారావు (విజయవాడ). జె.రమేష్, ఎల్.రాజశేఖర్ (ప్రకాశం-నెల్లూరు), కే.హైమత్ (చిత్తూరు). ఒక కో-ఆప్షన్ ఖాళీతో మొత్తం 33 మందిని ఎన్నుకోవడం జరిగింది.

అనంతరం సి.పి.ఐ.(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి కా॥ మండల వెంకన్న ఆహ్వాన సంఘ బాధ్యులను పరిచయం చేసారు. కా॥అప్పారావు, ఎల్.రాజు, లింగ్యా, రామచంద్రయ్య, కోడిసోమన్న, తదితరులు హాజర య్యారు.రాష్ట్రకార్యవర్గం వారికి అభినందనలు తెలిపింది.

పిడియస్‌యు మాజీరాష్ట్ర అధ్యక్షులు కా॥ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ విప్లవవిద్యార్థి ఉద్యమ నిర్మాణబాధ్యత మనందరిపై ఉందన్నారు. అమరులు కా॥జార్జి, జంపాలు, దుస్సా చేరాలు, కోలా శంకర్, శ్రీహరులు తాము నమ్మిన ఆశయాల కొరకు అమరుల య్యారని విద్యార్థులు ఆ బాటలో పయనించాలన్నారు. తెలంగాణా రాష్ట్రం వచ్చినా ప్రధాన సమస్యలు అలాగే ఉంటాయన్నారు. వాటి సాధన కోసం మన పోరాటాలు మరింత ఎక్కువ చేయాలన్నారు. విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలన్నారు.

లాల్‌సలాం పాటను అరుణోదయ కళాకారులు ఆలపించగా మహాసభ ఉత్తేజంగా ముగిసింది. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జనవరి 24న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వేలాదిమందితో నిర్వహించాలని మహాసభ పిలుపునిచ్చింది. పలు

విద్యా రంగ సమస్యలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. తెలంగాణా బిల్లు ఆమోదం పొందినవెంటనే రెండు రాష్ట్రాలకు కొత్త కార్యవర్గాలు వేయాలని మహాసభ తీర్మానించింది.

ఆకట్టుకున్న కళారూపాలు: బహిరంగసభలో అరుణోదయ కళాకారులు కామ్రేడ్స్ నిర్మల, రమ, భీమశంకర్, శ్రీశైలం, వేణు, మాగి వెంకన్నల బృందాలు విద్యార్థి సమస్యలపై విప్లవగేయాలను ఆలపించాయి. తెలంగాణా ఉద్యమంలోనూ విప్లవ విద్యార్థి ఉద్యమంలోనూ ప్రాణాలను త్యాగాలు చేసిన అమరులను స్మరిస్తూ పాడిన పాటలు విద్యార్థులను ఉత్తేజపరిచాయి.

ప్రతినిధులసభలోనూ వివిధ జిల్లాలనుండి వచ్చిన విద్యార్థులు ఆటపాటలతో మహాసభను ఉత్సాహపరిచారు. హైదరాబాద్‌నుండి కామ్రేడ్స్ రంజిత్, గణేష్, వరంగల్‌నుండి శ్రీశైలం, ఖమ్మం నుండి తారాచంద్,రాజేష్, అదిలాబాద్‌నుండి సురేష్‌లు పాటలు పాడారు.

ప్రత్యేకంగా చిన్నారులు వేసిన జజ్జనకరి జనారే నృత్యం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. 2006 వరంగల్‌లో జరిగిన రాష్ట్రమహాసభ నాటికి రోజుల పిల్లలుగా ఉన్న ఈ చిన్నారులు ఈ మహాసభల్లో నృత్యం చేయడం విద్యార్థులను ఆశ్చర్యానికి గురి చేసింది. కె.మేఘన, నున్నా ప్రజ్వల్, వెన్నెలలు అమరులను స్మరిస్తూ **'అమరులను తలుచుకుందుమా'** అంటూ పాడిన పాట ప్రతినిధులను కర్తవ్యోన్ముఖులను చేసింది.

మన్‌మోహన్‌సింగ్ ప్రధాన మంత్రిగా తెలవు ప్రకటించడానికి నేపథ్యం

1990 నాటికి సోవియట్ యూనియన్, తూర్పు యూరపు దేశాలు ఛిన్నాభిన్నమైనాయి. ప్రపంచంలో నామమాత్రపు సోషలిస్టు దేశాలు కూడా రద్దు గావడంతో సామ్రాజ్యవాదులకు తిరిగి తమ దోపిడీ, పెత్తనం సాగించడానికి ఎదురులేని పరిస్థితి ఏర్పడింది. అవి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, వుదారీకరణ విధానాలు ప్రపంచ దేశాలపై రుద్దడం ప్రారంభించాయి. పి.వి. నర్సింహారావు నాయకత్వాన గల భారత ప్రభుత్వం కూడా ఈ విధానాల్ని ఆహ్వానించింది. ఈ విధానాలు అమలు చేయుటకు మన్‌మోహన్ సింగ్, చిదంబరం, మాంటెగ్‌సింగ్ అహ్లూ వాలియా లాంటి ఆర్థిక నిపుణుల్ని పి.వి. నర్సింహారావు ఎంపిక చేసుకున్నాడు. మన్‌మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించుకున్నాడు. దేవేగౌడ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు చిదంబరాన్ని ఆర్థిక మంత్రిగా నియమించుకున్నాడు.

యుపిఎ ప్రభుత్వం 2004లో అధికారానికి వచ్చినపుడు సోనియాగాంధీ మన్‌మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించింది. యు.పి.ఎ -2లో కూడా మన్‌మోహన్ సింగే ప్రధానిగా కొనసాగాడు. ఆయన నాయకత్వంలో కాంగ్రెసు ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను మరింత దివాలా తీయించింది. సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల, కార్పొరేట్ సంస్థల దోపిడీకి గేట్లు బార్లా తెరిచింది. ప్రత్యేక ఆర్థిక మండళ్ళను ప్రవేశపెట్టి దేశంలో సామ్రాజ్య వాదుల వలస పెత్తనం ప్రారంభించడానికి పునాదులు వేసింది. పేద ప్రజలకు భూములు పంచే విధానానికి స్వస్తి చెప్పి దేశ, విదేశీ కంపెనీలకు "సెజ్"ల పేరిట లక్షల ఎకరాలు దారాధత్తం చేసే పద్ధతులు అనుసరించారు. అమెరికాతో అణు ఒప్పందం చేసుకోవటం ద్వారా దేశ ఆర్థిక, మిలిటరీ రంగాలను, రాజకీయ రంగాన్ని అమెరికాతో మరింత పెనవేసుకునేలా చేశారు. దేశంలో మన్‌మో హన్‌సింగ్ ప్రభుత్వ కాలంలో అనేక ఆర్థిక కుంభ కోణాలు సంభవించాయి. 2-జీ కుంభకోణంలో లక్షా 70 వేల కోట్ల రూ.లు స్వాహా జరిగిందని కాగ్ నివేదిక వెల్లడించింది. ఆదర్శ్ కుంభకోణం, బొగ్గు కుంభ కోణంలలో కూడా వేల కోట్లు చేతులు మారాయి. వీటన్నిటిలో కేంద్ర మంత్రులు ప్రత్యక్షంగా భాగస్వాములు.

వీటన్నిటి కారణంగా కాంగ్రెసు ప్రభుత్వాల ప్రతిష్ట రాజకీయంగా దిగజారింది. 2014లో జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెసు గెలుపుపై సందేహాలు మొదలైనాయి. ఈ పరిస్థితుల నుండి బయట పడటానికి ఆహార భద్రతా చట్టం, భూసేకరణ చట్టం, భూ సంస్కరణల ముసాయిదా బిల్లును రంగమెక్కించారు. అయినా 2013 డిసెంబరులో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెసు రాజస్థాన్, ఢిల్లీలో అధికారాన్ని కోల్పోయింది. రాజస్థాన్, ఢిల్లీలలో బిజెపి అత్యధిక స్థానాలు గెల్చు కున్నది. ఢిల్లీలో "ఆమ్ ఆద్మీ" పార్టీ కాంగ్రెసును మూడవ స్థానానికి నెట్టింది. 28 స్థానాలు గెల్చుకుని రెండవ స్థానానికి వచ్చింది. అవినీతికి వ్యతిరేకంగా "ఆమ్ ఆద్మీ" పార్టీ చేసిన కృషి ఫలితంగా అది ఢిల్లీలో యిలాంటి విజయం సాధించ గలిగింది. కాంగ్రెసు భవిష్యత్తును ప్రమాదంలో పడవేసింది. రాహుల్ గాంధీ చరిష్మాపై కాంగ్రెసులో అంతర్ మధనం మొదలైంది. సోనియా భక్త బృంధం మన్‌మోహన్ సింగు స్థానంలో రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని ప్రకటనలు మొదలు పెట్టారు. మోడీకి తగిన పోటీ యివ్వగల నాయకుడు రాహులేనని ప్రచారం మొదలు పెట్టారు. పలు దఫాలు ప్రధాన మంత్రి అవుతాడని వూహించిన ప్రణబ్ ముఖర్జీని రాహుల్‌కు అడ్డం లేకుండా రాష్ట్రపతిని చేశారు. మిగిలిన చిదంబరం తనకు స్థానం దక్కదని తెలిసి, మన్‌మోహన్ సింగు స్థానంలో రాహుల్‌ని ప్రధానిగా ప్రకటించాలనే రాగం అందుకున్నాడు. దీనితో తన పదవికి రోజులు మూదాయని గ్రహించిన మన్‌మోహన్ సింగ్ తను 2014 ఎన్నికల అనంతరం ప్రధాని రేసులో వుండననీ, రాహులే ప్రధానికాగల సమర్థుడని ప్రకటన చేస్తూ ముందుకు వచ్చాడు.

నిజానికి మన్‌మోహన్ సింగ్ ఆర్థిక నిపుణుడే గానీ, రాజకీయ సమర్థతగల నాయకుడు కాదు. కాంగ్రెసు శ్రేణుల్లో పలుకుబడిగల నాయకుడు కూడా కాదు. అందువల్లనే పలుమార్లు విమర్శలకు గురైనాడు. పదవీగండం కూడా ఎదుర్కొన్నాడు. అయినా అమెరికాకు, సోనియాగాంధీకి విధేయుడు గనుక ఆ పదవిలో కొనసాగాడు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో మన్‌మోహన్ సింగ్‌ను వదిలించు కోవడానికి కాంగ్రెసు సిద్ధమైంది. అతన్ని కొనసాగించడం కాంగ్రెసుకు నష్టమే గాని లాభం లేదు. ఈ పరిస్థితుల్లోనే మన్‌మోహన్ 2014 ఎన్నికల తర్వాత రాహుల్‌కు ప్రధాని పదవిని అప్పగిస్తానని ప్రకటించాడు. ఆయన ప్రధాని పదవిని స్వీకరించాక పది సంవత్సరాల్లో మూడే మూడుసార్లు జాతినుద్దేశించి మాట్లాడారు. మూడవసారి చేసిన ప్రకటనలో తన కాలంలో అన్ని రంగాల్లో విఫలమైనానని పరోక్షంగా అంగీకరించాడు. ప్రధానంగా ధరలను అదుపు చేయలేక పోయానని, దీనికి రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని చెప్పాడు. అధిక ధరలను అరికట్టాలంటే గిడ్డంగుల్ని పెద్ద ఎత్తున నిర్మించు కోవడమే తారక మంత్రంగా చెప్పాడు. ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన పరిస్థితులే కారణంగా పేర్కొన్నాడు. దేశ ప్రజలందరూ ఈసడించుకుంటున్నా 'అమెరికాతో అణు ఒప్పందాన్నే" ఆయన ప్రభుత్వం సాధించిన ఘన విజయంగా పేర్కొన్నాడు. తాను బలహీనమైన భారత ప్రధానిని గాననే చరిత్ర తెలియ జేస్తుందని ప్రకటిం చాడు. తన ప్రభుత్వ వైఫల్యాలకు తాను పేర్కొన్న కారణాలు పూర్తిగా హాస్యాస్పదమైనవి. ఆయన తిరిగి ప్రధాని కావాలనుకున్నా కాంగ్రెసు పార్టీ తిరిగి ఆయన్ను ప్రధానిగా చేసే పరిస్థితులు లేవు. అందుకే ముందుగానే ప్రధాన మంత్రి పదవికి 2014 ఎన్నికల అనంతరం వీడ్కోలు ప్రకటన చేశాడు.

ఒకవైపు రాహుల్‌ను ప్రధానిగా చేయడానికి అందరి అడ్డు తొలగించుకొనడానికి కాంగ్రెసు సన్నాహాలు చేసుకుంటున్నది. మరోవైపు బిజెపి మోడీ ప్రధాని గావడానికి ఏర్పడుతున్న ఆటంకాలు తొలగించు కోవానికి అది ప్రయత్నిస్తున్నది. అందులో భాగమే ఢిల్లీలోని "ఆమ్ ఆద్మీ" పార్టీ కార్యాలయంపై బిజెపి ప్రేరణతో "హిందూ రక్షాదళ్" చేసిన దాడి. ఢిల్లీ ఎన్నికల్లో 15 సంవత్సరాల కాంగీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్‌ని ఓడించి "ఆమ్‌ఆద్మీ" పార్టీ 28 స్థానాలు గెల్చుకున్నది. చివరికి అవినీతి మయమైందని ప్రకటించినప్పటికీ అది కాంగ్రెసు మద్ధతుతోనే ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. 2014 సాధారణ ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో పోటీ చేయడానికి సన్నద్ధ మవుతున్నది. ఈ పరిణామాలు రాబోయే పార్లమెంటరీ ఎన్నికల అనంతరం మోడీ నాయకత్వాన కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పరచాలనుకునే బిజెపికి కంటగింపుగా తయారైనాయి. అందుకే కాశ్మీర్‌లో సైనికుల గురించి "ఆమ్ ఆద్మీ" పార్టీ నేత చేసిన ప్రకటనను ఆధారం చేసుకొని కార్యాలయంపై దాడికి పూనుకున్నది. ప్రకటన చేసిన నాయకుడూ, కేజ్రీవాల్‌లు తమ ఉద్దేశాల గురించి విస్పష్టమైన ప్రకటన అనంతరం కూడా "ఆమ్ ఆద్మీ" పార్టీ కార్యాలయంపై "హిందూ రక్షక దళ్" చేసిన దాడి గర్హనీయమైంది. ఇది పెరుగుతున్న హిందూ మతోన్మాద ప్రమాదానికి సంకేతం.

ప్రతిపక్ష పార్టీలు ఏ నినాదాలతో గెలిచి రాష్ట్రాల్లో, కేంద్రంలో అధికారానికి వచ్చినా వాటిని పడగొట్టగల నైపుణ్యం, చాకచక్యం కాంగ్రెసుకు తెలుసు. ఇతర పార్టీల ప్రభుత్వాల ప్రభుత్వాల్ని మధ్యలోనే అధికారం నుండి పడగొట్టడం దానికి వెన్నతో పెట్టిన విద్య. నంబూద్రి పాద్ ప్రభుత్వాన్ని కేరళలో పడగొట్టిన దగ్గర నుండి - ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని యింకా అనేక ఇతర ప్రభుత్వాల్ని పడగొట్టిన హీనచరిత్ర తనకున్నది. కేంద్రంలో 1977లో ఎమర్జన్సీ అనంతరం అధికా రానికి వచ్చిన జనతా ప్రభుత్వాన్ని పడగొట్టింది. చరణ్ సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టింది. దేవేగౌడ ప్రభుత్వాన్ని పడగొట్టింది. వి.పి. సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టింది. అందువల్లనే ఢిల్లీలో "ఆమ్ ఆద్మీ" అధికారానికి రావడాన్ని కాంగ్రెసు పెద్ద ప్రమాదంగా చూడడం లేదు. బిజెపినీ, టిడిపినీ, మోడీలనే ప్రధాన ప్రమాదంగా చూస్తున్నది.

అందుకే అది "ఆమ్ ఆద్మీ" పార్టీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి సహకరించింది. మరో వైపు "ఆమ్ ఆద్మీ" నినాదాల్నే ప్రయోగిస్తూ ఓటర్లను కూడాగట్టుకోవడానికి రాహుల్‌ను ప్రధానిగా ప్రచారం మొదలు పెట్టింది. అవసరమొచ్చినపుడు తన తెలివి తేటలు ప్రయోగించి "ఆమ్ ఆద్మీ" పార్టీ అధికారాన్ని కాంగ్రెసు కూలదోయదనే గ్యారంటీ ఏమీ లేదు. ఇవి గమనించ వలసిన రాజకీయ అంశాలు.

14.01.2014

పరిగిలో తెలంగాణపై బహిరంగసభ

రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతంలోని పరిగి మండల కేంద్రంలో వచ్చే తెలంగాణ ఎట్లుండాలి" అనే అంశంపై 2013 డిసెంబర్ 28న స్థానిక మార్కెట్ సెంటర్‌లో బహిరంగ సభ జరిగింది. సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ బహిరంగ సభకు ఈ ప్రాంత నాయకుడు కా॥ మొర్రి సత్యం అధ్యక్షత వహించారు. సభలో ప్రాధన వక్తగా తెలంగాణ జేఏసీ కో-ఛైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ తెలంగాణ బిల్లు అసెంబ్లీకి వచ్చిన తరువాత సైతం దానిని అడ్డుకుంటామని మాట్లాడడం అర్థరహితమన్నారు.

ఇంకా ఈ సభలో సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా॥ కె. గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణం సామాజిక న్యాయం కేంద్రంగా సాగాలని కోరారు. నీళ్లు, నిధుల, వనరుల కోసం ప్రజానీకం ఉద్యమించాల్సిన అవసరముందన్నారు.

పరిగి శాసనసభ్యులు శ్రీ కొప్పుల హరీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే తెలంగాణలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రధాన్యతను ఇవ్వాలని కోరారు.

తెలంగాణ రీసెర్చ్ ఫౌండేషన్ నాయకులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్దే ధ్యేయంగా పరిపాలన కొనసాగాలన్నారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ వి. సంధ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు తెలంగాణాను విధ్వంసం చేసిన పాలకులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఇంకా ఈ సభలో బిజెపీ నాయకులు రాం యాదవ్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ ఎ. నరేందర్, టి-జాక్ జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్, సమాచార హక్కు చట్టం వెంకటయ్య, ఎఐకెఎంఎస్ నాయకులు రహీం, పరిగి టిజాక్ కన్వీనర్ సదానందం, అడ్వకేట్ జాక్ నాయకులు బ్రహ్మం, బలహీన వర్గాల నాయకులు లక్కం సత్యనారాయణ, అరుణోదయ నాయకురాలు అరుణ, పీవోడబ్ల్యూ నాయకురాలు సరళ మాట్లాడారు.

బహిరంగ సభ

తేదీ 19.1.2014 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్, హైదరాబాద్.

అధ్యక్షత : చిలుకా చంద్రశేఖర్, కన్వీనర్, ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక పోరాట కమిటీ

వక్తలు : హిమాంశుకుమార్, (గాంధేయవాది) వనవాసీ చేతనా ఆశ్రమం

: సుధా భరద్వాజ్, అడ్వకేట్, పియుసిఎల్, ఛత్తీస్‌ఘఢ్

: బొజ్జా తారకం, అధ్యక్షుడు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా

: ఉ. సాంబశివరావు, ఏ.పి. మహాజన సమితి

: ప్రొ. యస్. శేషయ్య, అధ్యక్షులు, పౌర హక్కుల సంఘం

: జయమ్మ, అధ్యక్షులు, చైతన్య మహిళా సంఘం

: వి. సంధ్య, అధ్యక్షులు ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ)

: పి. ప్రసాద్, ఇఫ్టూ

: మద్దు ప్రభాకర్, అధ్యక్షుడు కుల నిర్మూలన పోరాట సమితి

: కోట శ్రీనివాస్, అధ్యక్షుడు, టివిఎస్ జాక్

: రమణాల లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ

ప్రజా కళామండలి, అరుణోదయ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి.

ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను వెంటనే నిలిపివేయాలి

విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకిద్దాం!!

బ్రిటిష్ వాళ్ళు భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి ఆరున్నర దశాబ్దాలు పైబడ్డా. పేదలు మరింత పేదవారుగా. ధనవంతులు మరింత ధనవంతులుగా మార్చివేయబడుతున్నారు. అన్యాయం, అసమానతలు పెరిగిపోతున్నాయి. అభివృద్ధి వెలుగుల చీకటి కోణంలో పేద ప్రజలు మ్రగ్గిపోతున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ఇప్పటికీ ప్రజలందరికి అందుబాటులోకి రాలేదు. సహజ వనరులను కార్పొరేట్ శక్తులు దోసుకెళ్ళడమే అభివృద్ధిగా, దాన్ని వ్యతిరేకిస్తూ తిరుగుబాటు పోరాటం చేస్తున్న ప్రజలు నక్సలైట్లుగా భారత ప్రభుత్వం ప్రజల్లోకి ప్రచారాన్ని చేస్తుంది. భారత ప్రభుత్వం కొనసాగిస్తున్న గ్రీన్‌హంట్ యుద్ధానికి ప్రజల సాధికారతను పందడానికి విఫలయ్నతం చేస్తూ ఉంది. ఆదివాసీలపై సైన్యం, సాయుధ పోలీసుల దాడి నిరంతరం కొనసాగుతూ ఉంది. ఆదివాసీ గ్రామాలను సైనిక శిబిరాలుగా మారుస్తున్నారు. గ్రామాలకు గ్రామాలే తరించబడుతున్నాయి. దగ్ధం చేయబడుతున్నాయి. గ్రామాలను గిరిజనుల జీవితాలను అభివృద్ధిలోకి తీసుకురావాల్సిన అటవీ అధికార చట్టం, పంచాయితీరాజ్ ఎక్స్‌టెన్షన్ చట్టం అమలులో విఫలమై వారి జీవితాలను మొగ్గలోనే తుంచేస్తున్న వాస్తవాన్ని చూస్తున్నాం. గ్రామసభ నిర్ణయాధికారానికి విలువ లేకుండా పరిశ్రమలకు అనుమతిలిస్తూ ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్న పరిస్థితిని ప్రభుత్వాలు అభివృద్ధి నెపంతో వారిపై సాగుతున్న అణిచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు సిద్ధమయిన పరిస్థితి నేడు దండకారణ్యంలో నెలకొని వున్నది. వనరుల దోపిడీ చేయడం కోసమై, ఆదివాసులలో ఆశలు కల్పించడం కోసం జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం, గ్రామాలకు విద్యుత్, సర్వశిక్షా అభియాన్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, ఇలా వీటి అమలు కోసం కలెక్టర్, ఐ.ఆ, ఫారెస్టు అధికారులతో వున్న కమిటీకి ఒక్కొక్క బ్లాక్ కోసం 16,000 కోట్లు కేటాయించారు. ఆరున్నర దశాబ్దాల తర్వాత వీరి అభివృద్ధికి ఈ పథకాలు అవసరమయ్యాయా? లేక, వనరుల దోపిడీకోసం, అటవీ చట్టం, పీసా చట్టం అమలులోకి రాకుండా కూడా కుట్ర పన్నుతున్నారో, ప్రజలు. ప్రజాస్వామిక వాదులు అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. పేద ప్రజల అభివృద్ధిని నిర్ణయించేది, కార్పొరేట్ అభివృద్ధి కాదు. రాజ్యాంగం, చట్టాలు, న్యాయవ్యవస్థ, పార్లమెంటు అన్నింటినీ కార్పొరేట్లే నియంత్రిస్తున్నారు. పేద ప్రజలు తమ అభివృద్ధికై, హక్కులకై ఆకలి తీర్చుకోవడానికి తిరుగుబాటు చెయ్యకుండా ఉండలేని తప్పనిసరి పరిస్థితిని ప్రభుత్వాలే కల్పిస్తున్నాయి. అన్యాయం, అసమానతలను సహించక జరిగే తిరుగుబాటు విధానం ఎటువంటి రూపంలోనైనా వుండవచ్చు. దాన్ని ప్రజాస్వామిక వాదులందరూ సమర్థించాలి.

అరవై ఏళ్లకు కూడా. అక్షర జ్ఞానం అందించలేని ప్రభుత్వాలు. విష జ్వరాలకు పిట్టల్లా ప్రజలు రాలిపోతుంటే కనీసం తొంగిచూడని అధికారులు. బాసగూడ, గంగులూరు లాంటి ఊచకోతలపై పెదవి విప్పని కేంద్ర మంత్రులు. ఎవరి అభివృద్ధి కోసం ఇప్పుడు మాట్లాడుతున్నారు. దాన్ని అర్థం చేసుకున్న. ఆదివాసీలు అర్థం చేయించే ఉద్యమకారులతో కలిసి తమ హక్కుల కోసం నిజమైన అభివృద్ధి కోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని చెబుతున్నారు. సల్వాజుడుం దాడికి 644 గ్రామాలు దహనం. 1500 మంది హత్య, లెక్కకందని మహిళల అత్యాచారాలతో ఆదివాసుల జీవనం విధ్వంసానికి గురయ్యింది. జుడుం దాడులు విధ్వంసానికి ప్రతీకలే. అయితే జుడుంపై మాత్రం సుప్రీంకోర్టు ప్రతిబంధకాలు ఏర్పాటు చేసింది. మహేంద్రకర్మ, రమణ్‌సింగ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యింది. ప్రజలపై శాంతి పేరుతో జరిగిన దాడితో ధ్వంసమయిన ఆదివాసీ జీవితాలలో అభివృద్ధిని ఎక్కడ చూడగలం. తమ అభివృద్ధి కోసం 'జల్, జంగల్, జమీన్ హమారాహై' అనే నినాదంలో ప్రతిఘటనా పోరాటానికి సిద్ధమై వున్నారు. బ్రతుకులలో హక్కులను సాధించుకోవడం కోసం ఆచరణాత్మకంగా ఉద్యమిస్తున్న ఆదివాసులకు ప్రజాస్వామ్య వాదులుగా మన సంఘీభావాన్ని ప్రకటించాల్సిన బాధ్యతను నిరంతరం గుర్తు చేస్తూనే వున్నారు. అభివృద్ధి కోసం జరిగే పోరాటాలలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి పోరాట రంగంలో ముందుకు సాగుతూ దేశభక్తులుగా ఉన్న ప్రజాస్వామిక వాదుల మద్ధతును అడుగుతున్నారు. సహాయాన్ని కోరుతున్నారు. వారి అభివృద్ధిలోనే మన అభివృద్ధి దాగి ఉందనే నిజాన్ని మనకు తెలియజేస్తున్నారు. హింసా హింసల జోలికి వెళ్ళకుండా న్యాయం కోసం జరిగే పోరాటంలో మీరెటువైపు వున్నారని? ఆదివాసీ ఉద్యమం నిలదీస్తున్నది.

దేశంలో ప్రకృతి సంపదపై ప్రజలందరికి హక్కు వుంటుంది. నిక్షిప్తమై వున్న వనరులన్నింటిని ముందు తరాలకు ఉంచాల్సిన బాధ్యత కూడా మనపైన వుంది. ఆ వనరులు నేడు కొల్లగొట్టబడుతున్నాయి. దేశాభివృద్ధికోసం కాదు, కేవలం బహుళజాతి కంపెనీల లాభాల కోసం, ఈ దోపిడీకి అవకాశం కల్పిస్తున్న రాజకీయ నాయకుల స్వార్ధ ప్రయోజనాల కోసం తరలించబడుతున్నాయి. తిరగబడ్డ ఆదివాసీలపై సైన్యం దాడులు డ్రోన్‌ల (మానవ రహిత విమానాలు) రూపంలో కొనసాగుతున్నాయి. కోట్లాది విలువగల బాక్సైట్, ఐరన్, యురేనియం, లైమ్‌స్టోన్, డోలమైట్, టిన్, గ్రాఫైట్, కోబాల్ట్, బంగారం, వజ్రాలు, బొగ్గు నిక్షేపాలను దోచుకెళ్ళడానికి లక్షలాది పోలీసు బలగాలు, సైన్యాన్ని వినియోగించుకుంటున్నారు. దేశంలో వనరులను కాపాడడం కోసం ఆదివాసీలు ఆయుధం పడుతున్నారు. సమస్త విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకున్న ప్రజానీకం బాధ్యతారాహిత్యంగా ప్రశ్నించకుండా నిశబ్దంగా ఉన్నారు. జ్ఞానవంతుల గొంతు ఆదివాసీలకు బలమైన అండ, మేధావి మాట సహజ వనరులను రక్షించేదిగా వుండాలని ఆదివాసీలు కాంక్షిస్తున్నారు. ప్రగతిబాటను ప్రజలకు చెప్పాల్సిన వాళ్ళు వనరుల దోపిడీకి వ్యతిరేకంగా తమ గళాన్ని విప్పాలని కోరుకుంటున్నారు.

అడవిని నమ్ముకున్న ఆదివాసీలపై జరుగుతున్న సామ్రాజ్యవాద యుద్ధాన్ని నిలదీయడమంటే సహజవనరులను మనం కాపాడుకున్నట్లే. సమాజంలో మన బాధ్యతను నిర్వర్తించడమే. దేశభక్తి (ప్రజాతంత్ర) ఉద్యమంలో భాగస్తులమవడమే. అగ్రరాజ్యాలలో వనరులు ముందు తరాలకు దాచి వేయబడుతున్నాయి. మన దేశంలో మాత్రం ఉన్నత స్థాయి యాంత్రీకరణలో బొగ్గు, గుట్టలు, ఐరన్ అన్నీ కొల్లగొట్టబడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య దేశంలో నేరపూరితమైన విధానం. నేరం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాస్వామిక వాదులుగా మనందరిపైన వున్నది. ప్రభుత్వాధీనంలో సహజవనరులు పరిమితంగా ఉపయోగిస్తూ భవిష్యత్ తరాలకు అందే విధంగా ప్రజలు జీవించే విధంగా పర్యావరణాన్ని కూడా రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయితే ప్రజలుగా మనం ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమిష్టి ప్రజా ఉద్యమాన్ని చేపట్టి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. 2009లో ఏర్పాటైన ఆపరేషన్ "గ్రీన్‌హంట్" వ్యతిరేక ఉద్యమంలో తనవంతు గొంతును వినిపిస్తూనే ఉన్నాం. 53 ప్రజాస్వామిక, హక్కుల, సంఘాల సమన్వయ కమిటీ ఇది. ఆదివాసీలపై వేటను నిలిపివేయాలనే డిమాండ్‌తో ధర్నాలు, ర్యాలీలు, వివిధ నిరసన రూపాల ద్వారా తన గొంతును వినిపిస్తూనే ఉన్నాం. దేశవ్యాపిత హక్కుల సంఘాల సమన్వయ వేదిక సిడిఆర్ఓ (ప్రజాస్వామిక హక్కుల సమన్వయ వేదిక)తో కలిసి కూడా దేశవ్యాప్తంగా గ్రీన్‌హంట్ వ్యతిరేకంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాం. దేశంలో ప్రజాస్వామిక మేధావులతో కలిసి గ్రీన్‌హంట్ వ్యతిరేక క్యాంపేయిన్‌లో ఈ కమిటీ తన బాధ్యతలను నిర్వహిస్తూ ఉంది. అందులో భాగంగానే 19.1.2014నాడు సుందరయ్య కళాభవన్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో ఒక సమావేశాన్ని నిర్వహిస్తున్నాము. ఈ సమావేశానికి ప్రజలు, ప్రజాస్వామిక వాదులందరూ హాజరై సహజవనరుల రక్షణకై, ఆదివాసీలపై ప్రభుత్వం చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా తమ వంతు బాధ్యత నిర్వహించాలని, అట్లే ఈ సమావేశానికి హాజరై తమవంతు మద్ధతును తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

డిమాండ్లు

1. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే నిలిపివేయాలి.

2. ఆదివాసీ ప్రాంతాల నుంచి అన్ని రకాల పారా మిలిటరీ బలగాలను, సైనిక బలగాలను వెంటనే వెనక్కు తీసుకుని గాలింపు చర్యలు, దాడులు నిలిపివేయాలి.

3. బహుళజాతి కంపెనీలతో, బడా కంపెనీలతో ఆయా ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి. నిలిపివేయాలి.

శ్రామికీకరణకు ప్రతీక కామ్రేడ్ మాదాల నారాయణస్వామి

కామ్రేడ్ ఎం.ఎన్.ఎస్. గారికి జ్వరమట. హాస్పిటల్‌లో వున్నారట అని ఒకరోజు సమాచారం. మలేరియా జ్వరమట. ఐ.సి.యు.లో వున్నారట అని మరుసటి రోజు వార్త. మూడో రోజు కా॥ ఎం.ఎన్.ఎస్. గారి ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా వుంది, కొన్ని గంటల వ్యవధి మాత్రమే జీవించే అవకాశం వుంది అంటున్నారు డాక్టర్లు. వెంటనే బయలుదేరు అని కా॥ చిట్టిపాటి ఫోన్. మరికొద్ది సేపటికి గంటో - అరగంటో అంతే. డాక్టర్లు ట్యూబ్‌లు - అవీ తీసేశారు బయలుదేరండి అని చిట్టిపాటి మళ్ళీ ఫోన్ చేశాడు. మరికొద్ది నిమిషాలకు కా॥ ఎం.ఎన్.ఎస్. అమరులయ్యారు అనే విషాద వార్త!

రేపో మాపో నూరు సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న కా॥ ఎం.ఎన్.ఎస్. కొద్దిగా ముందుగానే కన్నుమూశారు. తన పరిపూర్ణ జీవిత కాలంలో అత్యధికం అంటే సుమారు 80 సంవత్సరాల కాలం రాజకీయ జీవితం. విప్లవ జీవితం గడిపినవారు. దీర్ఘకాలం దఫదఫాలుగా జైలు జీవితం, రహస్య జీవితం గడిపిన విప్లవనేత. విద్యార్థి దశ నుండి ప్రారంభించి వృద్ధాప్య దశ వరకూ పీడిత జన జీవితంతో పెనవేసుకున్న కామ్రేడ్. ప్రధానంగా రైతు-కూలీ రంగంలో కృషి చేశారు. వ్యవసాయ కూలీలు, దళితులు ఎదుర్కొనే భూమి సమస్య. అంటరానితనం, కుల వివక్ష, దళితులకు భూమి సమస్యలపై ప్రత్యక్షంగా ఉద్యమాలలో పాల్గొంటూ పీడిత ప్రజలతో మమేకం అయ్యారు. దేశంలోని అత్యధిక మెజారిటీ గ్రామీణ ప్రజల పేదరికం. దారిద్ర్యం తొలగిపోవాలంటే, ఈ అర్ధవలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థలో ప్రజల భూమి పోరాటం తప్పనిసరి అని భావించేవారు. నిరంతరం ఆదివాసీలు. దళితుల భూమి సమస్య పరిష్కారం కోసం తపన పడేవారు. ఒక్కమాటలో ...

లబ్ డబ్, లబ్ డబ్ - భూమి పేదలు. భూమి పేదలు
ఏమిటా శబ్దం ? అదా ! ...
అది కా॥ ఎం.ఎన్.ఎస్.గుండె చప్పుడు!
ఆయనెవరు?
విప్లవోద్యమానికి మిగిలిన పెద్ద దిక్కు
రెండు జిల్లాల - ప్రకాశం, గుంటూరు - వారధి
మూడు విప్లవాల సారధి
మూడు తరాల వారధి
ఉన్నత విలువల కానాచి
క్రమశిక్షణకు పెట్టిన పేరు - ఆయనే కా॥ ఎం.ఎన్.ఎస్.!

కా॥ ఎం.ఎన్.ఎస్. (మాదాల నారాయణస్వామి) ఆశించిన ఈ దేశ మెజారిటీ ప్రజల భూమి, భుక్తి, విముక్తి సాధించాలంటే - నూతన ప్రజాస్వామిక విప్లవ పరిపూర్తికి, అందులో కీలకమైన వ్యవసాయక విప్లవం కోసం, "దున్నే వానికి భూమి" ప్రాతిపదికన పోరాడవలసి వుంది. ఈ దేశ ప్రజలను బంధించి ఉన్న సామ్రాజ్యవాదం, బడా భూస్వామ్య, బడా బూర్జువా వర్గాల కూటమికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయవలసి వుంది. అధికార మార్పిడి తర్వాత గతంలో ఎన్నటికంటే మిన్నగా సామ్రాజ్యవాదం ఈ దేశ గ్రామీణ ప్రాంతపు మారుమూల ప్రాంతాల్లోనికి - తీర ప్రాంతం నుండి మారుమూల అటవీ ప్రాంతాలకు సైతం చొచ్చుకుపోయి తన దోపిడీని మరింత ముమ్మరం చేసింది. తన బహుళజాతి సంస్థల ద్వారా ప్రజల ప్రయోజనాలను, ఈ దేశ విలువైన సహజ వనరులను కొండ చిలువలా కబళించి వేస్తున్నది. ఇప్పటికే వున్న అసంఖ్యాకులైన భూమి హీనులకు తోడు చిన్న, సన్నకారు, పేద రైతుల భూములన్నిటిని వెన్నెముకలేని, తొత్తు పాలకవర్గాల సహాయంతో బలవంతంగా లాగివేసుకుంటున్నది. అందుకే ఈ దేశంలో భూస్వామ్యం, భూమి సమస్య రద్దుగాకపోగా గత కాలపు భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు తోడు మరింత తీవ్రంగా కొత్త రూపాలలో భూమి సమస్య ముందుకు వచ్చింది. దానిని గుర్తించటంలో చాలా మంది వెనుకబడినా కా॥ ఎం.ఎన్.ఎస్. ముందున్నారు.

సామ్రాజ్యవాదులను, వాళ్ల తైనాతీలను - దేశ, విదేశీ కార్పొరేట్ శక్తులను నిలదీయవలసి వుంది. సమరశీల విప్లవ పోరాటాలకు తీవ్రమైన కృషి చేయవలసి వుంది. దేశ వనరులు ఈ దేశ శ్రమజీవులు - ఆదివాసీ, దళిత, పేద, స్త్రీలకు మాత్రమే చెందుతాయని చాటి చెప్పవలసి వుంది. అందుకే నేనంటున్నా ... ఆ శక్తులనిలా ప్రశ్నిస్తున్నా ...

సహజ వనరులనే పేరెందుకు వచ్చిందో ...
తెలుసా నీకు? ఇప్పటికైనా తెలుసుకో,
ఇవి ఎవడబ్బ సొమ్ము, ఎవరి సొంత సొత్తు కాదు!
మానవ జాతి ఉపయోగానికి ప్రకృతి
ప్రసాదించిన కానుకలు!
మార్క్స్ మహాశయులన్నట్లు సహజవనరు -
భూమి ఒక తరం నుండి మరో తరానికి నిరంతరం
బదిలీ మాత్రమే జరగాలి తప్ప. ఇది
'నా సొత్తు' అనే హక్కు నీకసలే లేదు.
భూమికి దాని సంతానం - ఆడ. మగ - కోసం
అపారమైన ఉపయోగపు విలువేవుంటుంది. కాని నీవద్ద
దాచి పెట్టి, కూడబెట్టి వుంచుకునే నిధిగాదు,
అమ్మకపు సరుకుగాదు, అది గుర్తుంచుకో.
మధ్యలో నీవలా మార్చావు దానిని. అందుకే
ముందుగా ఆదివాసీ, దళిత, స్త్రీల, పేదలకే ఈ భూమి. అంటే
"దున్నేవానికే భూమి". అంతిమంగా అది
సమిష్టి అనుభవం మాత్రమే అంటున్నా!

భూమి తల్లి బిడ్డలారా వినండి!
తల్లి భూమి చెర విడిపించకుండా
తరతరాల మన బానిసత్వం రద్దు అసాధ్యం! కనుక
బిర బిర, బిర బిర, పదండి ముందుకు, పదండి ముందుకు
భూమి తల్లి చెరవిడిపిద్దాం.
భూమి స్వాధీన పోరులో భాగస్వాములమవుదాం!
కా॥ ఎం.ఎన్.ఎస్. గుండె చప్పుళ్ళమవుదాం!
అదే ఆ విప్లవ యోధునికి మనమందించే నివాళి.

నేను 1969 నుండి 1995 వరకు రహస్య కార్యకర్తగా పనిచేసిన కారణంగా కా॥ ఎం.ఎన్.ఎస్. గారితో ముఖ పరిచయం నాకు నేను 1985లో రాష్ట్ర కమిటీలోనికి తీసుకోబడిన తర్వాత మాత్రమే. అప్పటి నుండి అంటే 1985 నుండి 2010 వరకు రాష్ట్ర కమిటీలోనూ, 1996 నుండి 2004 వరకూ కేంద్ర కమిటీలోనూ కలిసి పనిచేయటం జరిగింది.

పార్టీ క్రమశిక్షణకు, విధానాలకు ఆయన అత్యంత విలువనిచ్చేవారు. కొన్ని సందర్భాల్లో వారం రోజుల వరకు, రాత్రి బాగా పొద్దుపోయేవరకూ సమావేశాలు జరిగేవి. అయినప్పటికీ ఆయన అలాగే కూర్చుని వుండేవారు తప్ప సమావేశంలో పడుకోవటం లేదా కాళ్ళు చాపుకోవటం చేసేవారు కాదు. ఆయన క్రమశిక్షణ అలా వుండేది. పార్టీ విధానాలు, నిబంధనావళికి నిక్కచ్చిగా కట్టుబడి వుండేవారు. ఫలానా విషయం పార్టీ నిబంధనావళికి వ్యతిరేకంగా అనుకుంటే ససేమిరా అంగీకరించేవారు కాదు.

కా॥ ఎం.ఎన్.ఎస్. గారి సైద్ధాంతిక నిబద్ధత :

అంతే గాక, ఆయన సైద్ధాంతిక నిబద్ధత కూడా ఎంతో లోతయినది. ఒకవేళ తాను భావించిన అంశం తప్పని తర్వాత తెలుసుకుంటే ఆత్మ విమర్శ చేసుకునేందుకు వెనుకాడేవారు కాదు. సరైనది అనుకుంటే ఖచ్చితంగా బలపర్చేవారు. నా దృష్టిలో వున్న ఒక విషయం : 2003 సం॥లో పార్టీ మహాసభలకు డాక్యుమెంట్ల తయారీ కోసం సన్నాహాల సందర్భంగా కేంద్ర కమిటీలో రివిజనిజంపై చర్చ జరుగుతోంది. కేంద్ర మహాసభ ఫలానా విషయం రివిజనిస్టు అవగాహన అని తేల్చిన అంశాలను తమ అవగాహనగా కలిగి



వున్నవారిని పార్టీ ఉన్నత స్థాయి కమిటీలలో ఉంచరాదని లేదా మహాసభ మద్దతు దారులు 2/3 వంతు కమిటీలలో వుండాలనే చర్చ జరుగుతోంది. చాలా మంది కేంద్ర కమిటీ నుండి జిల్లా కమిటీ వరకు అలాంటివారు కమిటీల్లో వుండకూడదని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అప్పుడు కా॥ ఎం.ఎన్.ఎస్.గారు - అంతేగాదు అలాంటి వాళ్ళను "ప్రజా సంఘాల అత్యున్నత స్థాయి"లో కూడా బాధ్యులుగా వుంచకూడదంటూ తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ సందర్భంగా ఆయన "అఖిల భారత రైతు - కూలీ సంఘం" (ఎఐకెఎంఎస్) కేంద్ర కార్యవర్గ అధ్యక్షులుగా వున్నారు. ఆ సంఘం నిర్వహణలో ఆయన కొన్ని ఇబ్బందులెదుర్కొంటున్నారు. మిగతా చాలా మంది కామ్రేడ్స్ ఆయనను బలపర్చారు. లోతయిన చర్చ జరిగింది. మొదట నిబంధనావళికి సవరణగా కూడా మహాసభలకు ప్రతిపాదించటం జరిగింది. కొన్ని స్థాయిల మహాసభలు కూడా పూర్తయ్యాయి.

కాని అంతలోనైన చర్చ జరిపిన నాయకత్వం తర్వాత దాన్ని నిబంధనావళి నుండి వుపసంహరించుకున్నది. ఒక అంశాన్ని చర్చించిన దాన్ని డాక్యుమెంటులో పెట్టనేలేదు. కొన్ని జిల్లాల్లో కామ్రేడ్స్ స్వయంగా సవరణ ప్రతిపాదించి క్రింది సభలు తీర్మానం చేశాయి. లెనిన్ దాన్ని కేవలం చర్చించారు కాని అమలు చేయలేదని అన్నది నాయకత్వం. అది వాస్తవం కాదు.

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ 3వ మహాసభలో బాగా చర్చ జరిగింది. ముగ్గురి కేంద్ర కమిటీ, ముగ్గురు ఎడిటోరియల్ బోర్డు సభ్యుల ప్యానల్స్ ఎన్నికల్లో రివిజనిస్టు మెన్షివిక్కులకు సంబంధించిన పోపోవ్ కేంద్ర కమిటీలో ఒక్కరిని, మార్టోవ్‌ను సంపాదకవర్గంలో ఒక్కరిని మాత్రమే కా॥ లెనిన్ వగైరా ఎన్నిక చేయటం జరిగింది. లెనిన్ అనుచరులు - లెనిన్, ప్లెఖనోవ్ లిద్దరు ప్యానెల్‌లో వున్నారు. మెన్షివిక్కులు దానిని తిరస్కరించి బయటికి వెళ్ళిపోయారు అదివేరే సంగతి. ఆ తర్వాత ప్లెఖనోవ్ కూడా ప్లేట్ ఫిరాయించాడు. మెన్షివిక్కులను (రివిజనిస్టులను) నిర్మాణ చర్యలు తీసుకోవటం గాకుండా బుజ్జగించి మార్చాలని (కిల్ విత్ ది కైండ్ నెస్) చెప్పాడు. లెనిన్ అంగీకరించకపోతే తాను కూడా మెన్షివిక్కులలో చేరిపోయాడు. ఆ విధంగా కా॥ ఎం.ఎన్.ఎస్.రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన చర్చలో స్పష్టంగా వున్నారు.

అంతేగాదు ఆ తర్వాత 2008లో మళ్ళీ మహాసభల షెడ్యూల్ ప్రారంభమై కేంద్ర కమిటీ స్థాయిలో చర్చలు జరుగుతున్న సమయంలో మమాసభల ఏజెండా "రివిజనిజం" అంశం ఏజెండాలో వున్నది. మూడు డాక్యుమెంట్లు ముందుకు వచ్చాయి. 1 కేంద్ర కమిటీ అధికార డాక్యుమెంటు (2) ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు - చంద్రం, ఎస్వీల ప్రత్యామ్నాయ డాక్యుమెంట్ (3) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర

సెక్రటేరియట్ సభ్యులు - డివికె, వివి, రవిల - ప్రత్యామ్నాయ డాక్యుమెంటు.

ఒకరోజు గుంటూరులో అఖిల భారత రైతు - కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కార్యవర్గం జరిగిన సందర్భంగా కా॥ ఎం.ఎన్.ఎస్. గారి ఆరోగ్యాన్ని పరామర్శిద్దామని మరో కామ్రేడ్‌తో కలిసి వారింటికి వెళ్ళాను. ఆయన చెట్టుక్రింద కుర్చీలో కూర్చుని వున్నారు. పరామర్శలు. పార్టీ విశేషాలు అయిపోయిన తర్వాత - "నేను డాక్యుమెంట్లు మీకు అందివుంటాయి కదా, చదివారా" అన్నాను. చాలా పెద్దగా వున్నాయి. నా కళ్లు సహకరించటం లేదు. చంద్రం వాళ్ళు రాసిన డాక్యుమెంట్ మాత్రమే చదివాను. మిగతావి చదువుదామంటే నాకు సాధ్యం గావటం లేదు" అన్నారు. మిగతావి కూడా చదివి సవరణలు ఏమైనా వుంటే పంపించండి" అన్నాను. "అబ్బా! అవి చదవలేను. రాయలేను. వీళ్ళిద్దరు (చంద్రం, ఎస్.వి.లు) రాసిన డాక్యుమెంట్‌తో విభేదాల్ని కరక్టే. అవి యధార్థాలు. కాకపోతే మనవాళ్ళు పేర్లు నిర్దిష్టంగా ప్రస్తావించారు. వాళ్ళు (డివికె, వివి. రవిలు) మింగుతారా" అని సందేహం వ్యక్తం చేశారు. వాళ్ళ మనస్తత్వం తెలుసు గనుక. మిగతావి మీరు చదవలేకపోతే నేను వచ్చి రెండు. మూడు రోజులుండి చదివి వినిపిస్తానని చెప్పాను. ఎందుకంటే అవి యింకా క్రిందికి విడుదల చేయలేదు. అలా చేయకుండా క్రింది కామ్రేడ్స్‌ను ఎవరినీ ఆ పనికి ఆయన వుపయోగించే సమస్యే వుండదు ఆయన క్రమశిక్షణ అలాంటిది. వచ్చే పెద్దవైతే నేనే ప్రయత్నిస్తానే అన్నారు. నాకేమో యిప్పుడే కలిపించుకోవాలనేది ఆయన అభిప్రాయం ఆ తర్వాత దరిదాపులలో కేసా రెండుమూడు కాని విభజనింపై యిద్దరు కేంద్ర కమిటీ సభ్యుల రాసిన డాక్యుమెంటు మాత్రం ఆ రోజు బలపరుస్తూ మాట్లాడారు.

2004 రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎనిమిది మంది రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ చంద్రం నాయకత్వంలో మహాసభకు అధికార తీర్మానానికి ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణ సమీక్షపై భాగస్వాములలో కా॥ నారాయణస్వామి గారు కూడా ఒకరు.

ఆదివాసీల భూ పరిరక్షణ హక్కులకు సంబంధించిన 1/70 చట్టానికి సంబంధించిన సందర్భంగా చర్చలో కూడా గిరిజనుల ప్రయోజనాలను ఆయన దృఢంగా బలపరిచారు. గిరిజనుల ప్రయోజనాలపై నొక్కి చెప్పారు. ఆనాడు చంద్రబాబు నాయుడు జాయింట్ మేనేజిమెంట్, వన సంరక్షణ సమితి పథకాలు, చెట్టు - పట్టా పథకాలు ఏర్పాటు ప్రకటించిన దానిపై చర్చ సందర్భంలో కూడా వి.వి. దానిని బలపర్చారు. కా॥ ఎం.ఎన్.ఎస్. వాటిని వ్యతిరేకించారు. ఆదివాసీలకు భూమిపై పూర్తి యాజమాన్య హక్కుగాకుండా జాయింట్ మేనేజిమెంట్, చెట్టు - పట్టా పథకాలు సరైనవి కావని మాతోపాటు కా॥ ఎం.ఎన్.ఎస్. గారు కూడా వాటిని తీవ్రంగా వ్యతిరేకించారు.

గౌరవనీయులు యుగంధర్, శంకరన్, శాస్త్రి, కొల్లా వెంకయ్యగార్లతోపాటు కా॥ ఎం.ఎన్.ఎస్.గార్లు హాజరైన భూ సంస్కరణలపై దక్షిణాసియా వర్క్‌షాప్‌లలో కూడా ఆదివాసీల ప్రయోజనాలకు అనుగుణమైన అనేక సవరణలు ప్రతిపాదించారు.

నాగార్జున సాగర్‌లో అణు విద్యుత్ కేంద్రం స్థాపన గురించిన చర్చ వచ్చినప్పుడు కూడా రాష్ట్ర కమిటీలో రైతు - కూలీ సంఘం బాధ్యతలు చూస్తున్న వి.వి. దానిని సమర్థించగా కా॥ ఎం.ఎన్.ఎస్. మాతోపాటు వ్యతిరేకించారు.

శ్రామికీకరణ, దళితీకరణ :

విప్లవకారులనే వారెవరైనా వాళ్ళు ఏ రంగంలో పనిచేస్తున్నప్పటికీ ఆ రంగంలోని శ్రామిక ప్రజలతో, శెక్షన్లతో మమేకమై కృషి చేయాలి. అలాగే భారతదేశంలో వున్న కుల వివక్ష ప్రత్యేక పరిస్థితులలో శ్రామిక ప్రజానీకంలో కూడా అత్యధిక మెజారిటీగా వుండి అంటరానితనం, వివక్ష, దాడులు, హత్యలకు గురవుతున్న దళితులతో మమేకం గావాలి. వారెదుర్కొంటున్న సమస్యలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించాలి. శ్రామిక వర్గ పోరాటాలు వాటిలో భాగంగా తప్పనిసరిగా దళితులెదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలను కూడా జోడించి కృషి చేయాలి. కామ్రేడ్ మాదాల నారాయణ స్వామి తాను భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినప్పటికీ తన భూమిని విప్లవోద్యమ అవసరాలకై ఖర్చు చేశారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి సంఘీభావంగా నాడు ఆంధ్ర ప్రాంతంలో జరిగిన సమరశీల, వీరోచిత, త్యాగమయ పోరాటాల కాలంలో తామంతా తమ తండ్రులను - "నా వాటా ఆస్తి నాకిచ్చి వెయ్యి" అని ఘర్షణపడి తెచ్చి ఉద్యమం కోసం ఖర్చు చేసేవారమని తమ అనుభవాలను కా॥ ఎం.ఎన్.ఎస్. చెబుతూ వుండేవారు. అందుకే మిగిలిన తమ కుటుంబ ఆస్తిలో తండ్రి తన వాటా ఆస్తిని తిరిగి తనకు యిస్తే రాజకీయాల కోసం ఖర్చు పెట్టేస్తానని తనకు, తన కొడుకు పేరిట కూడా గాకుండా తన మనుమడు (స్వామిగారి తండ్రికి మునిమనుమడు) పేరిట రాసేశారని చెప్పారు.

ప్రస్తుతం మనుమడి పేరిట రాసిన ఆస్తి కూడా (భూమి) అప్పులు తీర్చేందుకై అమ్మివేశారని తెలిసింది. కా॥ ఎం.ఎన్.ఎస్.గారు మరణించే నాటికి తనకిచ్చిన ఆయన పిత్రార్జితం అంతా కరిగిపోయింది. వున్నా నామమాత్రం. ఆయన జీవిత భాగస్వామి సులోచన గారికి తల్లిదండ్రులు స్త్రీ ధనంగా ఆమెకు ఇచ్చిన ఇల్లు తప్ప వేరే ఆస్థి లేదు. పిల్లలు చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూ తమ జీవితాలు గడుపుకుంటున్నారు. వాళ్ళు కూడా పార్టీకి, విప్లవోద్యమానికి సహకారంగా, సానుభూతి పరులుగానే వుంటున్నారు. ప్రత్యక్ష కార్యాచరణలో లేకపోయినప్పటికీ పార్టీ వుత్థాన - పతనాల (చీలికల) పట్ల స్పందిస్తూ వున్నారు. తమ (ఆశా) భావాలను వ్యక్తం చేస్తూ వుంటారు. ఆ రకంగా వాళ్ళు కూడా విప్లవోద్యమ శ్రేణులలో భాగంగా వున్నారని చెప్పాలి. స్వయంగా స్వామిగారి దంపతుల యిరువురి కుటుంబాలు కూడా ఉమ్మడి కమ్యూనిస్టు రాజకీయాలతో సంబంధం ఉన్న వాతావరణం కూడా కారణం గావచ్చు.

తెలంగాణా సాయుధ పోరాట సంఘీభావ ఉద్యమ కాలంలో కా॥ మాదల రైతు సమస్యలపై ప్రధానంగా వ్యవసాయ కూలీల సమస్యలపై వర్గ పోరాటాలతో పాటు. దళితులపట్ల అంటరానితనానికి వ్యతిరేకంగా మంచినీటి చెరువుల పోరాటాల వంటి వాటిలో భాగస్వాములు. నేటికీ కులాంతర వివాహాలను ప్రోత్సహించటంలో. దళితుల భూమి సమస్యల విషయంలో ముందుండేవారు.

విప్లవాదర్శాలను పాటించడంలో ముందువరుసలో కా॥ ఎం.ఎన్.ఎస్.:

1950ల నాటి తెలంగాణా పోరాట ఆంధ్ర సంఘీభావోద్యమ కాలంలో కా॥ ఎం.ఎన్.ఎస్. సమరశీల కార్యకర్తగా పనిచేస్తుండగా ప్రభుత్వం ఆయనపై కన్నెర్ర చేసింది. ఆయన కోసం వేటాడుతూ, ఆయన తమ్ముడు మాదాల కోటయ్యను, మరో కార్యకర్త మాదాల నర్సయ్య అనే వారిని అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి, పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారు. విప్లవకారుల కుటుంబాల పట్ల కూడా రాజ్యం ఎలాంటి శతృపూరిత వైఖరి కలిగి వుంటుందనే దానికి ఇది నిదర్శనం. ఆ రకంగా కా॥ ఎం.ఎన్.ఎస్. గారితోపాటు పీడిత ప్రజల కోసం త్యాగాలు చేసిన కుటుంబాల్లో భాగంగా ఆ కుటుంబం కూడా చరిత్రలో స్థానం సంపాదించుకుంది.

ఒక దఫా రాష్ట్రంలోని వివిధ జిల్లాలలోని కార్యకర్తల అలవెన్సులు సాధ్యమైనంత యూనిక్‌గా దాదాపు ఒకే విధంగా వుండాలని రాష్ట్ర కమిటీలో చర్చ జరిగిన సమయంలో తనకు మాజీ ఎంపీగా వచ్చే పెన్షన్ అది రాష్ట్ర కమిటీ సొత్తు అని, అది పార్టీ తనకిచ్చిన అలవెన్సుగా పరిగణించాలని ఆయన చెప్పారు.

1997 సం॥లో కా॥ జొన్నా కోటయ్య (నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ విప్లవ కమ్యూనిస్టు నాయకులు) గారితో ఒక రాష్ట్ర కమిటీ నాయకుడు యింటర్వ్యూ చేశాడు. ఆ సందర్భంగా కోటయ్యగారు వారి తరం అనుసరించిన పార్టీ విధానాలు, ఆదర్శాలను వివరించారు. నేటితరంపై కాస్త అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఇంటర్వ్యూను "ప్రజాపంథా" పత్రికలో ప్రచురించారు. దానికి "ప్రజాపంథా" ప్రింటింగ్ బాధ్యతలు చూస్తున్న మరో సీనియర్ కామ్రేడ్ ముందుమాట రాశారు. దీనిపై పార్టీ రాష్ట్ర కమిటీలో పెద్ద రచ్చ జరిగింది. దీనికి కొద్దిముందే రాష్ట్ర కమిటీలో నాలుగవ సర్క్యులర్ చర్చ సందర్భంగా కూడా పెద్ద వివాదం, భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. "గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు" రాష్ట్ర కమిటీ మెజారిటీ ముందు కమిటీలో చర్చించి పత్రికలో వేయలేదని, బుద్ధి పూర్వకంగానే వేశారని పెద్ద రబస చేసింది. అది "చిలికి చిలికి గాలివానై" కేంద్ర కమిటీ వరకు వెళ్ళింది. కేంద్ర కమిటీ కూడా వివరంగా చర్చ జరిపింది. నిర్మాణ విషయాలేవైనా వుంటే మీ కమిటీలో మాట్లాడుకోవచ్చు, కాని ఈ ఇంటర్వ్యూ జనరల్ కమ్యూనిస్టు ఉద్యమ ప్రమాణాలకు అనుగుణంగానే వుంది. ఇందులో తప్పులేదు. ఇంటర్వ్యూ రచయిత కొంత ఎక్కువ స్పందించి వుండొచ్చుగాని ఇంతర్వ్యూనే తప్పుబట్టరాదని కేంద్ర కమిటీ చెప్పింది. ఇంతకూ యిదంతా ఎందుకు చెబుతున్నానంటే - ఈ చర్చలో కా॥ ఎం.ఎన్.ఎస్. పాల్గొంటూ "కోటయ్యగారు చెప్పినవి అతిశయోక్తులుగావు, తమ హయాంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో అవన్నీ ఆనవాయితీగా ఆచరించామనీ కోటయ్యగారి భావాలను, ఇంటర్వ్యూను, ముందుమాటను బలపర్చారు.

కాని పై కమిటీ ఇలా చెప్పినప్పటికీ సందు దొరికినప్పుడల్లా డివికె బృందం ఆ యింటర్వ్యూను విమర్శిస్తూనే వుంది.

భూమి సమస్యపై కా॥ ఎం.ఎన్.ఎస్. :

స్వయంగా భూస్వామ్య వర్గం నుండి వచ్చిన కా॥ ఎం.ఎన్.ఎస్. మార్క్సిజం అధ్యయనం, విప్లవోద్యమపు ప్రత్యక్ష ఆచరణ ఇచ్చిన చైతన్యంతో ఆయన తన భూమిని విప్లవోద్యమానికి ఖర్చు చేశారు. అంతేగాక ఈ అర్ధవలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థలో కూడా బడా భూస్వామ్య - బడా బూర్జువా - సామ్రాజ్యవాదాల కూటమికి వ్యతిరేకంగా అశేష పీడిత ప్రజల పాత్ర కలిగిన నూతన ప్రజాతంత్ర విప్లవం పరిపూర్తి ద్వారానే అణచబడిన వర్గాల - ఆదివాసీ, దళిత, మహిళా, మైనారిటీ, పేద వర్గాల విముక్తి ఆధారపడి వుందని నమ్మారు. ఆ మార్గంలో ఉద్యమ నిర్మాణం సాగాలని బలంగా భావించేవారిలో కా॥ ఎం.ఎన్.ఎస్. ముందు వరుసలో వుండేవారు. ఈ విప్లవానికి వ్యవసాయ విప్లవం యిరుసుగా వుంటుందని "దున్నేవానికి భూమి" కేంద్ర నినాదంగా వుంటుందని దృఢంగా భావించేవారిలో ఒకరు మాదాల.

ఈ దేశంలో భూస్వామ్య వ్యవస్థ క్షీణించిపోయిందని, భూస్వాములు లేరని వాదిస్తూ అన్యాపదేశంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు కాలం చెల్లిందని భావిస్తున్న వారి వాదనలను ఆయన ససేమిరా అంగీకరించేవారు కాదు.

భూమి కలిగిన ముఖ్యంగా చిన్నకారు - సన్నకారు, మధ్యతరగతి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన, వాటిపై పోరాడవలసిన ఆవశ్యకతపై అవగాహన కలిగిన మాదాల వాటిపై పోరాటాలలో ముందుండేవారు. అయితే ప్రధానంగా భూమి హీనులు - వ్యవసాయ కూలీల ముఖ్యంగా ఆదివాసీల, దళితుల, పేదలకు భూమి పంపిణీ - భూమి స్వాధీనం సమస్యపై పోరాటాలను కీలకంగా పార్టీ చేపట్టాలని, అందుకోసం తీవ్రంగా కృషి చేయాలనే భావం కలిగి వున్నారు. నొక్కి చెప్పేవారు.

ఒక రకంగా మనందరి గుండె "లబ్ డబ్" అంటూ చప్పుడు చేస్తే కా॥ ఎం.ఎన్.ఎస్.గారి గుండె "భూమీ పేదలు - భూమీ పేదలు" అని కొట్టుకుంటుందన్నారు. ఆనాడు తెలుగునాట భూ పోరాటాలకు నాయకత్వం వహించటమేగాదు, ఈనాడు పల్నాడు, ప్రకాశం - నెల్లూరు భూ పోరాటాలకు నిరంతరం సలహాలు, సూచనలు అందించిన నేత కా॥ ఎం.ఎన్.ఎస్.

రాష్ట్రంలో ఎక్కడ భూపోరాటాలు జరిగినా ఆసక్తి చూపేవారు. తూర్పుగోదావరి జిల్లా ఉద్యమాల పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరిచేవారు. ఒక దఫా 1989 సం॥లో నాటి ఆంధ్రప్రదేశ్ రైతు - కూలీ సంఘం "రాష్ట్ర కార్యవర్గ సమావేశాల సందర్భంగా గోవిందపురం గ్రామంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం మూలంగా కా॥ ఎం.ఎన్.ఎస్.గారితో సహా రాష్ట్ర కార్యవర్గం మొత్తం అరెస్టు అయ్యింది. త్వరగా బెయిలు కూడా శాంక్షన్ కాలేదు.

1991వ సం॥రం ఎన్నికల ప్రచారం కోసం కా॥ ఎం.ఎన్.ఎస్. గారు తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీకి వచ్చారు. అదే రోజు దేవీపట్నం ప్రాంత ప్రజలకు - 1990లో మన పార్టీ కార్యకర్తలను హత్యగావించటంలో సూత్రదారుడైన కారం బాబూరావుకు, భూస్వామ్య గుండాలకు మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణలో భూస్వాముల ఏజెంట్ బాబూరావు చనిపోయాడు. అది తెలియక పశ్చిమ గోదావరి జిల్లాకు ఆ మార్గంలో వెళుతున్న కా॥ ఎం.ఎన్.ఎస్. బృందాన్ని పోలీసులు, గూండాలు వెంటాడారు. మనవాళ్ళు తప్పుకుని ఎలాగో గోదావరి అవతలికి వెళ్ళి బస్సు మీద వెళ్ళిపోయారు. అయితే యివతల వదిలి వెళ్ళిన ప్రచార జీబును గుండాలు దగ్ధం చేశారు. వాళ్ళెక్కిన బస్సుపై దాడికి కూడా ప్రయత్నించారు.

ఆ తర్వాత "అఖిల భారత రైతు - కూలీ సంఘం" (ఎఐకెఎంఎస్) ఏర్పడినప్పుడు దాని వ్యవస్థాపక మహాసభ కూడా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నగరంలో జరిగింది.

(మిగతా 11వ పేజీలో)

పిడియస్‌యు 19వ రాష్ట్ర మహాసభలకు సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సందేశం

ప్రియమైన కామ్రేడ్స్

రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి కదం తొక్కుతూ, పదం పాడుతూ పోరుగల్లులో బిగిపిడికిలి జండాలు చేబూని పి.డి.యస్.యు రాష్ట్ర మహాసభలకు హాజరైన విద్యార్థినీ, విద్యార్థులకు సి.పి.ఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్రకమిటీ తరుపున నా విప్లవాభినందనలు.

ధర్మం సాగిల పడినవేళ, అధర్మం వికటాట్టహాసం చేసినవేళ, ధర్మ సంస్థాపన కోసం ఉస్మానియాలో ఎగరేసిన చైతన్యకేతనం పి.డి.యస్.యు. చరిత్రకాలం కడుపుతో వుండి పి.డి.యస్.యు.ని ప్రసవించింది. పురిటిలోనే పుట్టినబిడ్డ గొంతు నులమాలని మతోన్మాదశక్తులు అనేక కుట్రలు పన్నాయి. కుయుక్తులు చేశాయి. మతోన్మాదులు తమ విషపు కత్తివేట్లతో విప్లవ మేధావి. యం.యస్.సి. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో గోల్డుమెడలిస్టు ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జిరెడ్డిని పొట్టనపెట్టుకున్నారు. కాని పొడిచేపొద్దును ఆపలేకపోయారు. నెత్తుటిమడుగులో ఒరుగుతున్న జార్జి ఆశయ పతాకాన్ని ఉస్మానియా మెడికల్ ఇంజనీరింగ్ విద్యార్థి. నిజామాబాద్ ముద్దుబిడ్డ కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ అందుకున్నాడు. జార్జి ఆశయాలకు. ఆలోచనలకు నిర్మాణ రూపం యిచ్చి నిర్బంధాల మధ్య అంతా తానై, పి.డి.యస్.యు జండాకి ప్రాణమై నిలిచాడు.

ఎమర్జన్సీ చీకటిరోజుల్లో ప్రభుత్వం కసాయి తూటాలకు బలై ఖమ్మంజిల్లా చిలకలగుట్టడవిలో ధిక్కార నినాదమై నేటికి ప్రతి విద్యార్థి గుండెల్లో చిరంజీవై జీవిస్తున్నాడు. ప్రభుత్వ నిర్బంధాన్నీ, రాజ్యహింసను ధిక్కరించి జార్జి, జంపాల, శ్రీపాద శ్రీహరి, చేరాలు, కోలాశంకర్, సాంబయ్య, చాంద్ పాషా, వెంకటనారాయణ, మధుసూదనరాజ్, క్రిష్టారెడ్డి. వీరన్న, జనార్ధన్, స్నేహలత, రంగవల్లులు బిగిపిడికిలి జండాకోసం నెత్తుటి ముగ్గులు వేశారు. విద్యార్థి ఉద్యమం కోసం ఎందరో వీరులు తమ గుండెనెత్తురులు ధారపోస్తూ రక్తంతో రహదారులు నిర్మించారు. విద్యార్థి సంఘం అంటే పి.డి.యస్.యు, పి.డి.యస్.యు అంటే బిగిపిడికిలి జండానే అని రాష్ట్ర విద్యార్థి లోకంపై వారి మనోఃఫలకాలపై చెరగని ముద్రని, బలమైన ప్రభావాన్ని పి.డి.యస్.యు కలుగజేసింది. పి.డి.యస్.యు వడివడి నడకలతో ఎన్నో సంవత్సరాల వయస్సున్న సంస్కరణవాద, రివిజనిస్టు సంఘాలు పోటీపడలేక తెరమరుగయ్యాయి.

అన్ని విశ్వవిద్యాలయాల ముందు బిగిపిడికిలి జండా ఎగురుతూ ఏ విద్యార్థి ఎటుపోవాలో దారి చూపింది. "ఈ దశాబ్దం మాది, వచ్చే దశాబ్దం మాది, రాబోయే యుగమంతా మాది, చరిత్ర చరిత్రంతా మాదే" అని సగర్వంగా ప్రకటించింది. ఉస్మానియాలో నడకలు నేర్చుకున్న పి.డి.యస్.యు కాకతీయ యూనివర్సిటీలో కాలుమోపింది. వరంగల్‌లో 1980లో 4వ మహాసభలు జరుపుకొని ఆంధ్ర యూనివర్సిటీలో 5వ మహాసభకోసం పరుగులు తీసింది. తర్వాత వెంకటేశ్వరయూనివర్సిటీని పరిచయం చేసుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అన్ని యూనివర్సిటీల ప్రధాన ద్వారాల ముందు పి.డి.యస్.యు జండా రెపరెపలాడింది. విద్యాలయాల ప్రాంగణంలో చర్చాగోష్టులు, సాంస్కృతిక ప్రదర్శనలతో, కాలేజీ ఫంక్షన్లలో తమదైన శైలిని ప్రదర్శించారు. విద్యార్థిలోకాన్ని తమవైపు ఆకర్శించారు. ఓనమాలు ఒకటి రెండే చదువంటే కాదని, విద్య అంటే విప్లవమని, విప్లవమే మార్గమని విద్యార్థి ఉద్యమంలో పి.డి.యస్.యు నూతన పరవళ్ళు సృష్టించింది. విప్లవ విద్యార్థి సంస్థలతో జతకట్టి ఉద్యమాల వెల్లువలను సృష్టించారు. గ్రామాలకు తరలండి అనే పిలుపుతో పి.డి.యస్.యు గ్రామాలకు వెళ్ళింది. గ్రామీణుల జీవితాలను చదివింది. మట్టిమనుషులతో మమేకమయ్యింది. వేసవి శెలవులు విహార యాత్రలతో, వినోదాలతో గడపకుండా గడప,గడపకు తిరిగి తమ విద్యుక్త ధర్మంగా మార్చి భూస్వామ్య వ్యతిరేక ప్రతిఘటనా పోరాటాలలో మమేకమయ్యారు. ఫోకస్ పేరుతో జాతీయ, అంతర్జాతీయ వార్తలను అన్ని కాలేజీల ముందు పెట్టి విద్యార్థులను చైతన్యపరిచారు. ఈ విద్యార్థి ఉద్యమంలో విద్యార్థులే కాకుండా విద్యార్థినులు సగభాగమై గోదావరిలోయ ప్రతిఘటనా పోరాటానికి నాయకుల్ని అందించింది పి.డి.యస్.యు. అటువంటి పి.డి.యస్.యు.కి వారసులు మీరు. ప్రతిఘటనా పోరాటం అంటూనే తూర్పును చూపెడుతూ పడమరకు నడిపించాలని రివిజనిస్టు నాయకత్వం నిశ్శబ్దంగా అడుగులు మారుస్తున్నపుడు తప్పటడుగుల్ని క్షమించవచ్చేమోగాని తప్పుడు మార్గాన్ని నిలవేయడం అనివార్యం. అమరుల మాట మనకు మార్గదర్శకం కావాలి.

నేడు జాతీయంగా, అంతర్జాతీయంగా అనేక పరిణామాలు వేగంగా జరిగిపోతున్నాయి. మూడవ ప్రపంచదేశాల జాతీయోద్యమాలు సామ్రాజ్యవాదాన్ని చావుదెబ్బలు తీసింది. అనేక దేశాల పోరాటాల ఫలితంగా సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాలను ప్రత్యక్షంగా పరిపాలించడం సాధ్యం కాదని గ్రహించింది. తమ పెట్టుబడిని ఎగుమతిచేసి మూడవ ప్రపంచదేశాలనూ, ఆ దేశ ప్రజలను దోపిడీ చేయాలని భావించారు. దానికనుగుణంగా దోపిడీ రూపాలను మార్చింది. ప్రపంచబ్యాంకు, ప్రపంచవాణిజ్య సంస్థ లాంటి అంతర్జాతీయ వేదికలను ఏర్పాటు చేశారు. సామ్రాజ్యవాదుల అవసరాలకనుగుణంగా మూడవ ప్రపంచదేశాల పాలకులు మౌలిక రంగాల్లో మార్పులు తీసుకువచ్చారు. పబ్లిక్‌సంస్థలన్నింటిని నిర్వీర్యం చేశారు. ప్రైవేటువ్యక్తులకు ధారాదత్తం చేశారు. ప్రైవేటీకరణే శరణ్యం అని ప్రచారం చేశారు.

కమ్యూనిజానికి కాలం చెల్లిందని. అన్ని యిజాలు చరిత్రలో మాయమైపోతాయని గావుకేకలు పెట్టిన సామ్రాజ్యవాదం నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ద్రవ్య సంక్షోభంతో సామ్రాజ్యవాద దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. తాము ఊపిరి పీల్చుకోవడానికి, తమ ఆధిపత్యం నిలబెట్టుకోవడం కోసం తమ భారాన్ని ప్రపంచ ప్రజలపై నెడుతుంది. అరబ్‌దేశాల ఆయిలు వనరులను మూడవ ప్రపంచ దేశాల ఖనిజసంపదలను కొల్లగొట్టడానికి అంతర్జాతీయ వేదికలను అమెరికా మరియు యితర సామ్రాజ్యవాద దేశాలు అంతర్జాతీయ వేదికలను నిస్సిగ్గుగా ఉపయోగించుకుంటున్నాయి. తామే ఈ విశ్వానికి నాయకులమని, అధినాయకులమని విర్రవీగిన అమెరికా, తాను పాడింది పాటగా, ఆడింది ఆటగా సాగిన అమెరికా ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో తమ సైన్యాన్ని దించింది. "ఉగ్రవాదంపై పోరాటం" అని ప్రపంచ ప్రజల్ని నమ్మించచూసింది.

ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ దేశాలలో జరిగిన వీరోచిత ప్రతిఘటనా పోరాటాలు అమెరికా కుంభస్థలంపై చావుదెబ్బలు కొట్టాయి. ప్రపంచ ప్రజల నిరసనతో పాటు వారి దేశాలలోని ప్రజల నిరసనను కూడా అమెరికా, బ్రిటన్‌లు ఎదుర్కోవాల్సి వచ్చింది. సద్దాం హుస్సేన్ బలిపీఠంపై ఎక్కి ఉరితాడును ముద్దాడితే ప్రపంచప్రజల రోమాలు నిక్కబొడుచుకున్నాయి. తన ప్రాణాలు అనంతలోకాల్లో కలిసిపోతున్నా సామ్రాజ్యవాదం నశించాలి అనే నినాదం అరబ్ దేశాలకే కాదు ప్రపంచంలో పోరాడే శక్తులకు ఉత్తేజాన్నిచ్చింది. చిన్నదేశమైనా ఇరాక్ పెద్ద సందేశం ప్రపంచప్రజలకిచ్చింది. అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా ఏకధృవ ప్రపంచ స్థితి నుండి బహుళ ధృవప్రపంచంగా మారడానికి యివి కారణమయ్యాయి. ఉపాధికోసం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా మూడవ ప్రపంచ దేశాలలో ప్రజల పోరాటాలు కూడా పెరుగుతున్నాయి.

జాతీయంగా యు.పి.ఏ పాలనపై ప్రజల అసంతృప్తి తీవ్రమవుతుంది. సామ్రాజ్యవాదుల అభివృద్ధి నమూనాను ఈ దేశంలో నమ్మకంగా పాలకులు అమలు చేస్తున్నారు. సామ్రాజ్య వాదుల ప్రయోజనాలకనుగుణంగా ఈ దేశంలో మౌలిక రంగాల్లో అనేక మార్పులు చేశారు. నూతన పారిశ్రామిక విధానం, నూతన వ్యవసాయ విధానం, నూతన విద్యావిధానం పేరుతో భారత పాలకులు సామ్రాజ్యవాదులు రూపొందించిన విధానాలకు, వారి ప్రయోజనాలకనుగుణంగా అడుగులు వేశారు. ఫలితంగా పరిశ్రమలు మూతపడి ఉన్న ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగ సైన్యం పెరుగుతుంది. బ్రతుకుదెరువు కోసం పడరానిపాట్లు పడుతున్నారు. వ్యవసాయరంగం సంక్షోభం ఫలితంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

మూడు దశాబ్దాల నూతన విధానం ఫలితంగా చదువు కొనగలిగే వర్గం, చదువు కొనలేని వర్గాలుగానూ, ఏర్పడ్డారు. దళితులూ, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు ఉన్నత చదువులు అందుకోలేకపోతున్నారు. ధనిక వర్గాలకు చెందిన కొద్దిమంది మాత్రమే ఉన్నత చదువులను అందుకోగలుగుతున్నారు. విద్యను ప్రభుత్వం ప్రైవేటుపరం చేసింది. విద్యను పరిశ్రమగా మార్చి లాభాలు పిండుకొని దోపిడీ శక్తులకు అందిస్తోంది. నూతన విద్యావిధానం కంప్యూటరీకరణ, ప్రైవేటీకరణలతో విద్యార్థుల్లో ఎన్నో ఆశలు పెంచింది. లక్ష ఉద్యోగాలు, కోటి ఉద్యోగాలు ఎండమావులే అని విద్యార్థిలోకం గ్రహించడానికి ఎంతోకాలం పట్టలేదు.

పాశ్చాత్యమోజులో అమెరికా వైపు పరుగులు తీస్తున్న మన విద్యార్థులు అమెరికాలో పెట్రోలు బంకుల్లో, హోటళ్లలో సర్వర్లుగా, ఫ్యాక్టరీలలో కూలీలుగా, అపార్టుమెంటులలో గార్డులుగా పొట్టపోసుకుంటున్నారనే హృదయవిధారక దృశ్యాలు మనల్ని, మన భవిష్యత్‌ను ప్రశ్నిస్తున్నాయి. ఈ దేశంలో చదువుకోసం పోరాటం, వసతుల కోసం పోరాటం, ఉద్యోగాలకోసం పోరాటం ఒక్క మాటలో చెప్పాలంటే బడిలో అడుగుపెట్టినప్పటి నుండి జీవితంతో పోరాటమే.

సామ్రాజ్యవాద విషసంస్కృతి విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తోంది. మన దేశ జీవనాడుల్ని కుంగదీస్తుంది. ప్రేమ పేరుతో మహిళలపై లైంగికదాడులు, యాసిడ్‌దాడులు పెరిగిపోతున్నాయి. నిర్భయ చట్టాలు స్త్రీలకు రక్షణ కల్పించలేకపోతున్నాయి. స్త్రీని మార్కెట్ సరుకుగా చూసే ధోరణి రాజ్యమేలుతుంది. భూస్వామ్య సంస్కృతి స్త్రీకి ఆంక్షలు విధిస్తుంటే, విషసంస్కృతి ఆందోళనకర ఫలితాలను చూపిస్తుంది. వీటికి వ్యతిరేకంగా నేడు విద్యార్థిలోకం కర్తవ్యాలను రూపొందించుకోవాలి.

భూమికోసం, భుక్తికోసం, ఈ నేలతల్లి విముక్తికోసం నాడు వీరోచిత తెలంగాణా సాయుధపోరాటం జరిగింది. నేడు అదే ప్రాంతంలో వేరు తెలంగాణా కావాలని ప్రజలు తమ ఆకాంక్షలతో ఉద్యమిస్తున్నారు. అనేకమంది ప్రభుత్వ నిర్బంధంలో అశువులుబాశారు. వేయి మంది దాకా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తెలంగాణా ప్రజల సంఘటిత పోరాటాల ఫలితంగా ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణా ప్రకటన ఎట్టకేలకు చేసింది. ఇది లాబీలతో సాధ్యం అయ్యేదికాదు. ఎవరు అవునన్నా, కాదన్నా రాబోయే తెలంగాణాను ఎవరూ అడ్డుకోలేరు. అందుకే తెలంగాణాను మనస్ఫూర్తిగా ఆహ్వానిద్దాం. తెలంగాణా ప్రజల ఆకాంక్షను గౌరవిద్దాం. తెలంగాణా పునర్నిర్మాణంలో రైతులు, కూలీలు, విద్యార్థులు, మహిళల ఆకాంక్షలు చోటుచేసుకోవాలి. వాటి కోసం భవిష్యత్‌లో ఉద్యమించాల్సివుంది. అందువలన ఈ మహాసభల్లో మీరు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలకోసం పోరాడుతూనే సమాజంలో జరిగే యితర వర్గాల, ప్రజల ఉద్యమాలకు సంఘీభావం తెలపండి. ఈ మహాసభల్లో భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని బలమైన విద్యార్థి సంఘంగా ఎదగాలని, ఉద్యమాలతో యితర కొత్తప్రాంతాలకు పిడియస్‌యు విస్తరింపచేయాలని ఆకాంక్షిస్తున్నాను.

ఈ ప్రపంచం మీది మాది

అంతిమంగా ఈ ప్రపంచం మీది ...

అన్నాడు కామ్రేడ్ మావో

భవిష్యత్ సమాజ నిర్మాణంలో మీరు భాగస్వాములు కావడానికి మీరు చురుకైన పాత్ర పోషించాలని కోరుతున్నాను. అమరవీరుల పోరాటజండాను పైకెత్తిపట్టండి. విజయం మనదే.

నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

ప్రతిఘటనా పోరాటాలు వర్ధిల్లాలి!!

అమరవీరులకు విప్లవ జోహార్లు!!!

4.1.2014

చంద్రన్న

రాష్ట్ర కార్యదర్శి

సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ

రాష్ట్రకమిటీ

(వరంగల్‌లో జరిగిన పీడీయస్‌యు రాష్ట్ర మహాసభలో ఈ సందేశాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గం సభ్యులు కా॥ చిట్టిపాటి వెంకటేశ్వర్లు చదివి వినిపించారు.)

సర్దార్ పటేల్ ఒక మతతత్వ వాది, అందుకే బిజెపీకి ఆయనపై ఎనలేని భక్తి

దేశానికి కాబోయే ప్రధానిగా గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడిని బీజేపీ, తదితర హిందూత్వ సంస్థలు ఆకాశానికెత్తుతూ తెగ ప్రచారం సాగిస్తున్నాయి. ఈ సందర్భంగానే ఇదే గుజరాత్‌కు చెందిన వల్లభాయ్ పటేల్ స్మారకార్థం పనిలో పనిగా నరేంద్రమోడీ, ఇవే హిందూత్వ సంస్థలు ప్రపంచంలోనే అతిపెద్ద విగ్రహ నిర్మాణాన్ని సాగిస్తున్నాయి. సర్దార్ పటేల్‌ను ఉక్కుమనిషిగా అభివర్ణిస్తూ నేడు దేశమంతటా ఆయన భారీ విగ్రహం కోసం ఇనుమును సైతం - నాటి రాముడి గుడి కోసం ఇటుకలను సేకరించిన చందంగానే - సేకరిస్తున్నాయి. 1947 అధికార మార్పిడి సందర్భంగా దేశంలోని సంస్థానాలన్నిటిని విలీనం చేసిన శిల్పిగా అభివర్ణిస్తూ సంఘపరివార్ శక్తులు సర్ధార్ పటేల్ గురించి అసత్యాలను, అర్థసత్యాలను ప్రచారం సాగిస్తు మరోసారి హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయి. ముంబైకి చెందిన ప్రముఖ చరిత్రకారుడు, న్యాయవాది, పాత్రికేయుడు అయిన ఏ.జీ. నూరానీ పటేల్‌పై రాసిన వ్యాసాన్ని పాఠకుల సమాచారం కోసం ఈ దిగువన అందజేస్తున్నాం.

– సంపాదకులు

"మెజారిటీ మతానికి చెందిన మతతత్వాన్ని, జాతీయవాదంగా భావించే ప్రమాదం నిరంతరం పొంచి ఉంటుంది"

- 1961 జనవరి 5న జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలివి.

1945 నవంబర్‌లో ముంబయిలోని మెరైన్ డ్రైవ్ వద్ద 'ప్రాణ్ సుఖ్‌లాల్ మఫత్‌లాల్ హిందూ స్విమ్మింగ్ బాత్'ను ఒక ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు ప్రారంభించారు. నాటి నుండి నేటి వరకు ఆ స్విమ్మింగ్‌పూల్ లోకి కేవలం హిందువులను మాత్రమే అనుమతిస్తారు. ముస్లింలను, ఇతర మతస్థులను నేటికీ అందులోకి అనుమతించడం లేదు. అటువంటి స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించిన వ్యక్తి ఎవరో తెలుసా? ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్. ఆయన సాధించిన ఈ ఘనకార్యం గురించి తెలియజేస్తూ ఆ ప్రాంగణ ముఖద్వారం వద్ద చాలా కాలం పాటు ఒక ఫలకం ఉండేది

ఇది జరిగిన కొద్ది రోజులకే 1945 నవంబర్ 18న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) సమావేశంలో పటేల్‌కూ, ద్విజాతి సిద్ధాంతకర్త మొహమ్మద్ ఆలీ జిన్నాకూ మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమావేశంలో పటేల్ ప్రసంగానికి జిన్నా ఇలా సమాధానం ఇచ్చారు. "హిందూ, ముస్లింలు సోదరులు, ఒకే జాతికి చెందినవారు అని పటేల్ లాంటి వ్యక్తి ఎంత తక్కువగా చెబితే అంత మంచిది. ఆయన ఈ మాటలు చెప్పడానికి ఎంతమాత్రం అర్హుడు కాదు. ముంబయిలో కేవలం హిందువులకు మాత్రమే అనుమతిచ్చే ఈత కొలనును వల్లభాయ్ పటేల్ ప్రారంభించలేదా? సముద్రపు నీటిని కూడా పంచుకోవడానికి ముస్లిం సోదరులకు అనుమతిలేని ఈత కొలను ప్రారంభోత్సవంలో పటేల్ పాల్గొనడాన్ని నిరసిస్తూ కొంత మంది యువకులు ప్రదర్శన చేసిన విషయం ఆయన మరచిపోయారా?" (ది నేషన్స్ వాయిస్, వాల్యూమ్ 4, 1947 ... ఎడిటర్ వహీద్ అహ్మద్)

జవహర్‌లాల్ నెహ్రూ గానీ, సి. రాజగోపాలాచారి (రాజాజీ) గానీ అయ్యుంటే ఇంత దిగజారిన పనిచేసి ఉండేవారు కాదు. ఇలాంటి వాళ్లనుద్దేశించే అనుకుంటా నెహ్రూ తన ఆత్మకథలో "కాంగ్రెస్ వాళ్లలో చాలా మంది జాతీయవాదం ముసుగు వేసుకున్న మతతత్వ వాదులున్నారు" అని పేర్కొన్నారు. (పేజీ 136)

పటేల్ తత్వమేంటో మనం తెలుసుకోవాలంటే నేడు ఆయనను ఆకాశానికెత్తి ఆదర్శంగా చూపిస్తున్న వారి గురించి తెలుసుకోవాలి. వారిలో ఒకరు ఎల్.కె. అద్వానీ, 1990 నవంబర్ 19న అయోధ్యలో చెప్పిన మాటలివి: "ఇకపై హిందూ ప్రయోజనాలు కాపాడేవారే భారత దేశాన్ని పాలిస్తారు". 1990 అక్టోబర్ 2న ఆయన ఇలా అన్నారు : "హిందూ ఆశలపై లౌకిక విధానం అహేతుకమైన అనేక పరిమితులు విధిస్తోంది". ఇంకా బిబిసితో ఆయన ఇలా చెప్పారు : "బిజెపీని హిందూ పార్టీ అంటే తప్పేమీ కాదు" (ఆర్గనైజర్, 1989 ఆగస్టు 5). 1989 అక్టోబర్ 17న టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక సంపాదకీయంలో అద్వానీని కింది విధంగా విమర్శించింది : "భారత్‌మాత" గురించి నిత్యం చెప్పే అద్వానీ ధోరణి మహాత్మా గాంధీని జాతిపితగా అంగీకరించని స్థాయికి వెళ్లింది" (మరిన్ని వివరాల కోసం నేను రాసిన "ఆర్ఎస్ఎస్ - బిజెపి" పుస్తకం 4వ అధ్యాయం చూడండి. లెఫ్ట్ వరల్డ్ ప్రచురణ). మరి గాంధీ మీద బిజెపీకి ప్రేమ పుట్టుకురావడం అనేది ఇటీవలి పరిణామం. దాని వెనుక ఒక పథకం దాగి వుంది.

నరేంద్ర మోడీ ఒకప్పుడు అద్వానీ శిష్యుడు. ప్రధాని అభ్యర్థి పదవికి జరిగిన పోటీలో ఆయనను గద్దె నుండి దించేసినప్పటికీ ఆయన పంథాను మాత్రం ఇంకా తీవ్రంగా అనుసరిస్తున్నారు. ఆయన మాటలు చదవండి : "దేశమూ, హిందువులూ ఒక్కటే. హిందువుల అభివృద్ధి జరిగితేనే దేశాభివృద్ధి జరిగినట్లు. హిందువుల ఐక్యత దేశాన్ని బలోపేతం చేస్తుంది". మంగుళూరులో జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో దాని అధినేత మోహన్ భగవత్ సమక్షంలో నరేంద్ర మోడీ ఈ మాటలు చెప్పారు. "గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన సామాన్య స్వయం సేవక్ (అందులో మోడీ కూడా ఒకరు) దేశంలో గుజరాత్‌ను నెంబర్‌వన్ రాష్ట్రంగా మార్చడానికి అహర్నిశలూ కృషి చేస్తున్నారు" అని చెబుతూ తను "తన జీవితం మొత్తాన్నీ హిందూ సమాజం కోసం పనిచేశాను" అని మోడీ అన్నారు. (ఆర్గనైజర్, ఫిబ్రవరి 11, 2007)

అంతేకాదు 2008 జూన్ 2న బిజెపి విదేశాంగ విధాన పత్రాన్ని విడుదల చేసిన జస్వంత్ సింగ్‌ను 'నేపాల్ లౌకిక రాజ్యాంగా మారితే బిజెపీ సంతోషిస్తుందా' అని అడిగితే అలా జరిగితే హిందూ "సనాతన ధర్మాన్ని నమ్మేవాడిగా తాను కృంగిపోతానని" అన్నారు. నేపాల్ లౌకిక రాజ్యంగా మారితేనే బాధతో కృంగిపోయే వీళ్లు మన రాజ్యాంగంలోని లౌకికతత్వాన్ని నిజంగా ఆమోదిస్తారా అన్నది ప్రశ్న. వీళ్ల బుర్రల్లో భారత జాతీయ వాదం, హిందూ మతతత్వ వాదం లేక మోడీ చెప్పినట్లు హిందూ జాతీయ వాదం అనే రెండు లేవు. ఉన్నదంతా ఒకటే హిందూ మతతత్వ వాదం. అందుకే వీరు నెహ్రూను ద్వేషిస్తారు. పటేల్‌ను ఆరాధిస్తారు.

నిజ నిజాలు

భారత జాతీయవాదులకు భిన్నంగా .. తమను తాము హిందూ జాతీయ వాదులమని చెప్పుకుంటున్న ఈ ముసుగు వీరులు సర్దార్ వల్లభాయి పటేల్‌ను పొగడ్తలతో ముంచెత్తడానికి కారణం. ఆయన వారి సిద్ధాంతాలకు దగ్గరగా ఉండడమే. విశేషమేమంటే వీరు పటేల్‌లో ఉన్న సుగుణాలేమిటో చెప్పి పొగడడం లేదు. ఆయనను నెహ్రూకు వ్యతిరేకంగా నిలబెట్టి పొగుడుతున్నారు. దీనివెనుక లక్ష్యం ఒకటే. హిందూ జాతీయవాదం పేరుతో భారత జాతీయవాదాన్ని రూపుమాపడం. అప్పుడు భారత జాతీయవాదంతో పాటు లౌకిక వాదం కూడా రూపుమాసిపోతుంది.

నెహ్రూ ఈ రెంటి కోసం అంటే, భారత జాతీయవాదం, లౌకికతత్వం కోసం నిలబడ్డారు. ఆయన స్థాపించిన విలువలను నిర్మూలించడమే ఈ మతతత్వ వాదుల లక్ష్యం. నెహ్రూ ఇటువంటి ఉపద్రవాన్ని చాలా కాలం క్రితమే గుర్తించారని నాటి మన విదేశాంగ శాఖ కార్యదర్శి వై.డి. గుండేవియా తన ఆత్మకథలో రాశారు. తన శాఖలో వారానికొకసారి జరిగే సమావేశంలో అధికారులనుద్దేశించి ప్రసంగించమని ప్రధాని నెహ్రూను గుండేవియా కోరారు. నాడు కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చి ఉంది. "రేపు కేంద్రంలో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే తమ సర్వీసులకు ఏమవుతుంది?" అని గుండేవియా అడిగారు. దానికి నెహ్రూ సమాధానమిస్తూ మీరంతా కమ్యూనిస్టులు, కమ్యూనిజం అంటే ఎందుకంత భయపడిపోతున్నారు? మనం చేయలేంది కమ్యూనిస్టులు చేసేస్తారా? అసలు కమ్యూనిస్టులు ఓట్ల ద్వారా అధికారంలోకి వస్తారని ఎందుకనుకుంటున్నారు? అని అంటూ "గుర్తుంచుకోండి, భారత దేశానికి కమ్యూనిజం వల్ల ప్రమాదం లేదు, ప్రమాదమంతా హిందూ మితవాద మతతత్వ వాదుల నుండే" అని నెహ్రూ చెప్పారు.

ఒకసారి కేంద్రంలో అధికారాన్ని రుచి చూసిన హిందూత్వ శక్తులు ఇప్పుడు మరోసారి ఎలాగైనా, అవసరమైతే మోడీ వాచాలతను ఉపయోగించుకునైనా, లేక గుజరాత్ అల్లర్లలో అతని పాత్రను చూపించైనా, లేక ఆర్ఎస్ఎస్ - హిందూత్వకు ఆయన తిరుగులేని మద్దతును చూపించైనా అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారు. వారి ఈ స్కీములో వల్లభాయ్ పటేల్ వ్యక్తిత్వం వారికి సరిగ్గా సరిపోతుంది.

నెహ్రూ - పటేల్

తన వారసునిగా పటేల్‌ను కాకుండా నెహ్రూను నిర్ణయించడంలో గాంధీ తెలివిగా వ్యవహరించారు. నాడు నెహ్రూ ప్రజలకు తిరుగులేని నాయకుడు. ప్రపంచమంతటికీ భారత దేశ జాతీయవాదానికి ప్రతిబింబం ఆయన. పటేల్‌ది సంకుచిత మనస్తత్వం. ఆయనకు పార్టీ యంత్రాంగం మీద మంచి పట్టు ఉండేది. నిధులు బాగా వసూలు చేసేవారు. ఇద్దరిలో ఒకరికి మరొకరి అవసరం ఉండేది. కాంగ్రెస్ అభ్యర్థికి నిధులు కావాలి. అదే సమయంలో ప్రజా మద్దతు కూడా కావాలి. నెహ్రూ వారికి దేశమంతటా ప్రజా మద్దతు సమకూర్చేవారు.

నెహ్రూ సంస్కారం కలిగి, సున్నితంగా ఉండేవారు. పటేల్ కొంతవరకు ముతకగా ఉండేవారు. నెహ్రూకు ప్రాపంచిక దృక్పథం ఉండేది. పటేల్‌కు అంతర్జాతీయ వ్యవహారాలు తెలిసేవి కావు. నెహ్రూ అనేక తీవ్రమైన తప్పిదాలు చేసినా, వైఫల్యాలున్నా ఆయన గొప్ప వ్యక్తి. పటేల్‌కు అనేక మంచి లక్షణాలున్నా అల్పమైనవాడు

మద్రాసు రాష్ట్రానికి బ్రిటీష్ ప్రభుత్వ చివరి గవర్నర్ అయిన సర్ ఆర్చిబాల్డ్ న్యే పటేల్ చనిపోయిన రెండు మాసాలకు 1951 ఫిబ్రవరి 15న ఆయన గురించి బ్రిటీష్ ప్రభుత్వానికి ఒక రహస్య నివేదిక పంపారు. ఎంతో సమతుల్యంగా ఉన్న ఈ నివేదికలో ఆయన ఇలా పేర్కొన్నాడు : "కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కోశాధికారి అయిన పటేల్ పార్టీ యంత్రాంగం మీద చివరి వరకు గట్టి పట్టు కొనసాగించారు. పార్టీపై ఆయన పట్టు ఎంతగా ఉండేదంటే, 1950 సెప్టెంబర్‌లో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాని (నెహ్రూ) ఇష్టానికి వ్యతిరేకంగా ఆయన పురుషోత్తమదాస్ టాండన్‌ను పోటీకి నిలిపాడు. సర్దార్ పటేల్ ప్రపంచంలో అందరికన్నా గొప్ప పార్టీ నాయకుడనడంలో సందేహం లేదు. వ్యక్తిగతంగా నిజాయితీపరుడే అయినా ఆయన పద్ధతులు అనుమానించదగ్గవి. మార్వాడీ వ్యాపారుల నుండి నిధులు వసూలు చేయడంలో ఆయన వారసత్వం అవినీతికి దారితీసిందనీ, పార్టీని ఇప్పటికీ అది పట్టి పీడిస్తున్నదనీ విమర్శలున్నాయి. చాలా వరకు మానవతావాది. మంచి ఆకర్షణగల నాయకుడైనప్పటికీ ఆయన ప్రతిపక్షాలను మాత్రం సహించలేకపోయేవారు. హిందూ జాతీయవాదిగా పేరుపొందిన ఆయన ఆర్ఎస్ఎస్‌తో రహస్య, వ్యక్తిగత సంబంధాలు, ఏర్పాట్లు ఉండేవి. భారత్, బ్రిటీష్ వ్యాపార ప్రపంచంతో మంచి సంబంధాలుండేవి అందువల్లనే కాంగ్రెస్ నాయకులు ప్రధానికి కాకుండా ఆయనకు విజ్ఞాపనలు చేసుకుంటేండేవారు. సనాతన హిందువుగా ఆయన తన మతతత్వ సానుభూతులను కప్పిపుచ్చుకునేవారు కాదు." 1946 అక్టోబర్ 22న నాటి వైస్రాయ్ బ్రిటీష్ రాజుకు పటేల్ గురించి రిపోర్టు చేస్తూ, ఆయన "ఖచ్చితమైన మతతత్వవాది" అని చెప్పారు ('అధికార బదిలీ' వాల్యూం 8, పేజీ 772)

ఇటువంటి మనిషి నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశానికి ఎటువంటి ప్రతిష్ట తెస్తారో ఆలోచించుకోవచ్చు. ఇటువంటి వ్యక్తి ఉన్నతమైన సంప్రదాయాలు గల మన బహుళ సంస్కృతుల దేశానికి స్ఫూర్తిని ఎలా ఇవ్వగలుగుతారు? పటేల్ పారిశ్రామికవేత్తలకు దగ్గరి బంధువు. కార్మికులంటే సానుభూతిలేని వ్యక్తి. న్యే చెప్పినట్లు ఆయన అసమ్మతిని ఏ మాత్రం సహించలేరు. కమ్యూనిస్టులనేకాదు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని కూడా ఆయన చిన్నచూపు చూసేవారు.

వల్లభాయి పటేల్ మాదిరిగానే రాజేంద్రప్రసాద్, పురుషోత్తమదాస్ టాండన్, కె.ఎం. మున్షి, గోవింద వల్లభ్ పంత్, ఇంకా చాలా మంది కాంగ్రెస్ నాయకులు హిందూ జాతీయ వాదులుగానే ఉండేవారు అని ప్రొఫెసర్ యోగేంద్ర మాలిక్, వి.బి. సింగ్‌లు రాశారు. ("భారత దేశంలో హిందూ జాతీయవాదులు: భారతీయ జనతాపార్టీ ఎదుగుదల" విస్తార్ పబ్లిషర్స్, 1994, పేజీ 219) వీరెవరూ కూడా కాంగ్రెస్‌లో గొప్ప భక్తుడూ, హిందూ మతగ్రంథాలైన భగవద్గీత, ఉపనిషత్తులను ఔపోసన బట్టిన రాజగోపాలాచారి (రాజాజీ)కి ఏమాత్రం సరిపోలరు. రాజాజీ ఎంత భక్తుడో అంత లౌకికవాది. అందుకే ఈ హిందూ జాతీయవాదులకు రాజాజీ అన్నా, నెహ్రూ అన్నా పడదు. నెహ్రూను తొలి ప్రధానిని చేసినందుకు సంఘ్ పరివారం గాంధీని విమర్శిస్తారు. కానీ 1949-50లో తొలి గవర్నర్ జనరల్‌గా ఉన్న రాజాజీని తొలి రాష్ట్రపతి కాకుండా కుట్రపన్నిన పటేల్‌ను మాత్రం విమర్శించరు. గవర్నర్ జనరల్ గృహం నుండి రాజాజీని తొలగించి రాజేంద్ర ప్రసాద్‌ను పటేల్ తొలి రాష్ట్రపతిగా చేసినందువల్ల ఆయన 1947-50 మంత్రి వర్గాన్ని మతపరంగా విమర్శించడానికి తోడ్పడ్డాడు.

రాష్ట్రాలపై శ్వేతపత్రాలు

కాషాయ పరివారం పటేల్ విజయాలను బూతద్దంలో చూపిస్తూ ఆయన వైఫల్యాలను విస్మరిస్తున్నారు. వివిధ సంస్థానాలు భారత యూనియన్‌లో కలవడం రెండు దశల్లో సాగింది. మొదటిది, వివిధ సంస్థానాలు యూనియన్‌లో విలీనం కావడం, రెండోది అవి పునర్వ్యవస్థీకరించబడి ఇతర రాష్ట్రాలలో కలిసిపోవడం. ఈ రెండో దశలో పటేల్ చాకచక్యంగా పనిచేశారని ఆయన రాసిన 'భారత సంస్థానాలపై రెండు శ్వేతపత్రాలు' పుస్తకం చదివితే తెలుస్తుంది. కానీ సంస్థానాల విలీనం అనేది మొదటి దశలో జరిగింది. ఇదే కీలకమైన దశ. ఒకసారి సంస్థానాధిపతులు ఆత్మ స్థైర్యం కోల్పోయిన తరువాత వారి సంస్థానాలు విలీనం చేయడం సులువయింది. 1947 ఆగస్టు 15

[illegible] కాశ్మీర్. హైదరాబాద్ మినహా మిగిలిన సంస్థానాలన్నీ [illegible] సంతకాలు చేశాయి. ఈ విషయంలో చివరి [illegible] లార్డ్ మౌంట్ బాటన్ మెళకువలూ, ఆనాటి సంస్థానాల [illegible] కార్యదర్శి వి.పి. మీనన్ యొక్క న్యాయ శాస్త్ర [illegible] ఎంతగానో పనిచేశాయని మీనన్, అప్పటి సంస్కరణల కమిషనర్ హెచ్.వి. హడ్సన్‌లు రాసిన పుస్తకాలు తెలియజేస్తున్నాయి. వైస్రాయ్ సంస్థానాల విలీనానికి తను చేసిన కృషిని పటేల్‌కు ఎప్పటికప్పుడు చెబుతుండేవారు. సంస్థానాధిపతుల ఛాంబర్‌లో జిన్నా [illegible]డైన భోపాల్ నవాబ్ ప్లేటు ఫిరాయించిన తరువాత విలీనాల విషయంలో భారత్ పని సులువైపోయింది.

రాష్ట్రాల విలీనంపై సర్దార్ పటేల్ అభిప్రాయాలను హడ్సన్ 'మహా విభజన' (1969) పుస్తకంలో చక్కగా రికార్డు చేశారు. ఆయన ఇలా రాశారు : “మీరు రాష్ట్రాల గురించి ఆందోళన చెందవద్దు అని సర్దార్ నతో (మౌంట్ బాటన్) అన్నారు. ఎందుకంటే (బ్రిటీష్ నుండి) అధికారం చేతులు మారిన వెంటనే సంస్థానాల్లోని ప్రజలు తిరగబడతారు. వారు తమ పాలకులను గద్దెదించి కాంగ్రెస్‌తో చేతులు కలుపుతారు. అయితే సంస్థానాల వద్ద సొంత సైన్యం ఉందని వైస్రాయ్ [illegible] ఆ సైన్యానికి బ్రిటీష్ వాళ్లు శిక్షణ ఇచ్చారు. [illegible] హైదరాబాద్ సంస్థానం లాంటి కొందరి [illegible] సైన్యం ఉంది. మరికొన్ని సంస్థానాల్లో స్వంత [illegible] దళాలున్నాయి. ప్రజల నుండి తిరుగుబాటు వస్తే [illegible] వారి సొంత దళాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇదే జరిగితే భారత్‌కు నష్టం జరుగుతుంది అని వైస్రాయ్ చెప్పారు. దానికి పటేల్ 'ఏమిటి మీ ఉద్దేశం' అని అడిగారు. దానికి వైస్రాయ్ సమాధానమిస్తూ, సంస్థానాధిపతుల పదవులనూ, భూమియేతర హక్కులనూ, వ్యక్తిగత సంపదనూ వారికే అట్టిపెడితే దానికి ప్రతిఫలంగా వారు భారత డొమినియన్‌లో చేరతారు. రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార సంబంధాలు వంటి వాటిని కేంద్రానికి అప్పగించి మిగిలిన హక్కులన్నీ వారికే ఉంచేయాలి అని చెప్పారు. దీని గురించి ఆలోచిస్తాను అని పటేల్ అన్నారు.

“తరువాత పటేల్ వి.పి. మీనన్‌ను కలిసి, సంభాషించి వైస్రాయ్‌ని చూడ్డానికి వచ్చారు. మౌంట్ బాటన్‌తో ఆయన ఇలా చెప్పారు: “మీరు [illegible] అంగీకరించడానికి నేను సిద్ధమే. అయితే మీరు నాకు 'ఒక గంపనిండా ఆపిల్ పళ్లు ఇవ్వాలి' అన్నారు. అంటే ఏమిటి అర్థం? అని లార్డ్ మౌంట్ బాటన్ అడిగారు. “నేను [illegible] పళ్లు - మొత్తం సంస్థానాల సంఖ్య - ఉన్న ఆపిల్ బుట్టకొంటాను. కానీ అందులో రెండు లేక మూడు పళ్లు తగ్గినా కొనను అని పటేల్ అన్నారు. “దీన్ని నేను పూర్తిగా ఒప్పుకోను. కానీ నా శాయశక్తులా ప్రయత్నిస్తాను” అని మౌంట్ బాటన్ అన్నారు. ఒకవేళ బుట్టలో 560 ఉంటే మీరు కొంటారా? అని మౌంట్ బాటన్ అంటే, 'కొనొచ్చు' అని పటేల్ సమాధానం చెప్పారు. (హడ్సన్ పుస్తకం 367-8 పేజీలు). ఆ విధంగా సంస్థానాలు - బుట్టలో ఆపిల్ పళ్లు - సమీకరించే పనిని పటేల్ అటు మౌంట్ బాటన్‌కూ, ఇటు మీనన్‌కూ అప్పగించారన్న మాట. అందువల్ల భారతదేశాన్ని ఐక్యపరిచే ప్రతిష్ట ఈ వ్యక్తులిద్దరికీ దక్కుతుంది.

గాంధీ హత్య

పటేల్ 'సాధించిన' ఈ విజయాలను ఒకవైపు బూతద్దంలో చూపిస్తూ మరోవైపు గాంధీని హత్య చేయడంలో వీరసావర్కర్ పన్నిన కుట్రను మొగ్గలోనే తుంచివేయడంలో పటేల్ వైఫల్యాన్ని విస్మరిస్తున్నారు. ఈ విషయంలో ఆయనను తీవ్రంగా విమర్శించిన వారిలో జయప్రకాష్ నారాయణ్ కూడా ఉన్నారు. “హోమ్ శాఖలో మతతత్వానికి అతీతంగా ఉండే వ్యక్తి ఉండాలని నేను కోరుకుంటున్నాను” అని జయప్రకాష్ నారాయణ్ 1948 ఫిబ్రవరి 28న పేర్కొన్నారు. (బాంబే క్రానికల్, ఫిబ్రవరి 28,1948)

1948 జనవరి 20న గాంధీ ప్రార్థనా సమావేశం వద్ద మదన్‌లాల్ పహ్వా ఒక బాంబు పేల్చాడు. దానికి వారం రోజుల క్రితమే ఆయన సావర్కర్‌ను కలుసుకున్నాడు. 1948 జనవరి 30 గాంధీని హత్య చేశారు. ఈ పదిరోజుల కాలంలో కుట్రను భగ్నం చేసి గాంధీ ప్రాణాలు కాపాడి ఉండేవారు. కానీ అలా జరగలేదు. మహాత్ముడు అమరుడైనాడు. తన “హంతకుల ముఠాలో ఒకడినని” మదన్‌లాల్ పహ్వా పోలీసులతో చెప్పాడు. తను వ్యక్తిగతంగా సావర్కర్‌ను కలిశానని కూడా చెప్పాడు. “దీని వెనుక కుట్ర దాగి ఉందని ఏడు గంటల్లోనే పోలీసులకు తెలిసిపోయింది. ఎంతమంది వ్యక్తులు దీనివెనుక దాగి ఉన్నది కూడా వారికి తెలిసింది. వారి వద్ద ఉన్న సమాచారంతో, కొంత ఓర్పుగా కృషి చేసుంటే వారు గాంధీ హత్యకు ముందే నాథూరామ్ గాడ్సేను పట్టుకుని ఉండేవారు” (లార్రీ కోలిన్స్, డొమినిక్ లాపిర్రె, “ఫ్రీడం ఎట్ మిడ్‌నైట్” 1976, పేజీ 412 : వీరికి పోలీసు ఫైల్స్ వెదకడానికి అనుమతి లభించింది). ఢిల్లీలో సీనియర్ పోలీసు అధికారుల తీవ్ర నిర్లక్ష్యాన్ని అవి బట్టబయలు చేశాయి. సావర్కర్‌ను అరెస్టు చేయడానికి మొరార్జీ దేశాయ్ నిరాకరించారు. మదన్‌లాల్ తొలిరోజే సావర్కర్ పేరు చెప్పాడు కాబట్టి పటేల్ ఆయన అరెస్టుకు ఆదేశించాల్సి ఉండాల్సింది. జనవరి 24వ తేదీన రాత్రి 9.30 నిమిషాలకు 54 పేజీల ఒప్పుకోలు పత్రంపై మదన్‌లాల్ సంతకం చేశాడు. (అదే పుస్తకం పేజీ 418). ఒక మహాత్ముని జీవితం కాపాడ్డానికి అప్పటికి కూడా ఇంకా సమయం ఉంది. కానీ పటేల్ ఆ పని చేయలేదు. ఈ విషయం గురించి సంఘ్ పరివారం ఏనాడూ నోరెత్తదు. కానీ 1953 జూన్ 23న శ్రీనగర్‌లో శ్యాం ప్రసాద్ ముఖర్జీ గుండెపోటుతో మరణించడానికి మాత్రం నెహ్రూ, షేక్ అబ్దుల్లాలను బాధ్యులను చేసి విమర్శిస్తుంటారు.

మహాత్మాగాంధీ హత్యకు జరిగిన కుట్రపై “విచారణ కమిటీ నివేదిక” సమర్పించిన జస్టిస్ జె.ఎల్. కపూర్ ... మహాత్ముని ప్రాణం తీసిన ఈ హత్యపై విచారణ జరగాల్సిన రీతిలో జరగలేదనీ, అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం కనిపించిందని చెబుతూ, “విచారణకు ఇంఛార్జి మంత్రిగా ఉన్న హోమ్ మంత్రి వల్లభాయి పటేల్‌కూడా దీనిపై ఆసక్తి చూపించినట్లు కనిపించలేదు” అని చెప్పారు.

ఆజాద్‌కు వ్యతిరేకి

స్వాతంత్ర్య భారత తొలి మంత్రివర్గంలో అబ్దుల్ కలాం ఆజాద్‌కు స్థానం ఉండకూడదని నెహ్రూను గాంధీ కోరారు. కారణం “క్యాబినెట్‌లో ఆయన ఉండకూడదని సర్దార్ గట్టిగా పట్టుబడుతున్నారు. ఆయన కాకుండా ఇంకో ముస్లిం మంత్రి పేరు ప్రతిపాదించడం కష్ట సాధ్యం” అని గాంధీ చెప్పారు. (మహాత్మాగాంధీ ఏరిన రచనలు వాల్యూమ్ 9, పేజీ 408). తరువాత మరింత ఘోరమైన విషయం జరిగింది. మహమ్మద్ అలీ జిన్నా చేసిన అవమానాలూ, తన స్వంత మతస్థుల ఛీత్కారాలు సహించి నిలబడిన ఆజాద్ దేశభక్తిని పటేల్ బహిరంగంగానే ప్రశ్నించడం ప్రారంభించారు. 1947 డిసెంబర్ 27న లక్నోలో ఆజాద్ ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ మహాసభ నిర్వహించి కాంగ్రెస్‌లో చేరాలని ముస్లింలను అభ్యర్థించారు. ఆ మరునాడు ఇదే విధమైన తీర్మానం మహాసభలో ఆమోదించారు. (నేను రాసిన “భారతీయ ముస్లింలు : చారిత్రక పత్రాలు”. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్, 2003, పేజీ 65లో చూడండి).

అయితే అదే నగరంలో కొద్ది రోజుల తరువాత 1948 జనవరి 6న పటేల్ ఒకవైపు ఆజాద్ దేశభక్తిని ప్రశ్నిస్తూ, అదే ప్రసంగంలో హిందూమహాసభ, ఆర్ఎస్ఎస్ వాళ్లను కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించారు. పచ్చి మతతత్వ వాదులు మాత్రమే ఆ పని చేయగలరు. ఆయన ఇలా అన్నారు : “నేను భారతీయ ముస్లింలను ఒకే ప్రశ్న వేస్తున్నారు. ఇటీవల జరిగిన అఖిలభారత ముస్లిం కాన్ఫరెన్స్‌లో మీరు కాశ్మీర్‌పై ఎందుకు నోరు మెదపలేదు? పాకిస్తాన్ చర్యలను ఎందుకు ఖండించలేదు? ఇవన్నీ ప్రజల మనసుల్లో సందేహాలు లేవనెత్తుతున్నాయి. దేశభక్తి లేనివారు పాకిస్తాన్ వెళ్లిపోవచ్చు”. అప్పటి నుండి కాశ్మీర్ అనేది ముస్లింల దేశభక్తికి పరీక్షగా మారిపోయింది.

ఆర్ఎస్ఎస్‌కు ఆహ్వానం

పటేల్ ఒకవైపు ముస్లింలపై కత్తిదూస్తూనే ఆర్ఎస్ఎస్‌కు స్నేహ హస్తం అందించారు. “నేను ఆర్ఎస్ఎస్ వారిని ఒకటే కోరుతున్నాను. దేశంలో అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని బలహీనపరచవద్దు, మీరంతా వచ్చి కాంగ్రెస్‌లో చేరండి ... అధికారంతో ఆర్ఎస్ఎస్‌ను అణచివేయవచ్చునని కాంగ్రెస్‌లో కొందరు భావిస్తున్నారు. ఒక సంస్థను మీరు “దండం”తో అణచివేయలేరు. 'దండం' దొంగలు, బందిపోట్ల కోసం ఉద్దేశింపబడింది. కానీ ఆర్ఎస్ఎస్ వాళ్లు దొంగలూ, బందిపోట్లూ కారు. వాళ్లు దేశభక్తులు. వాళ్లు దేశాన్ని ప్రేమిస్తారు. అయితే వాళ్ల ఆలోచనలే దారిమళ్లాయి. కాంగ్రెస్ వాళ్లు ప్రేమతో వాళ్ల హృదయాలను గెలుచుకోవాలి”. ('ఐక్య భారత దేశం కోసం : సర్దార్ పటేల్ ప్రసంగాలు', పబ్లికేషన్ విభాగం, పేజీలు 64-65). నెహ్రూ లేని సమయంలో ఆయన చాలా మంది ఆర్ఎస్ఎస్ వాళ్లను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోకి తీసుకున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలో నెహ్రూ చేతులు కట్టిపడేయడానికి దారితీసింది. ఢిల్లీలో ముస్లిం శరణార్థుల కోసం కొన్ని ప్రాంతాలను రిజర్వు చేయాలనీ, ముస్లిం శరణార్థుల సమస్యలు పరిష్కరించడానికి ముస్లిం అధికారులను నియమించాలనీ నెహ్రూ చేసిన ప్రతిపాదనలను పటేల్ ప్రతిఘటించారు. దీనితో నెహ్రూ చాలా విసిగిపోయారు. ఢిల్లీలోనూ, యునైటెడ్ ప్రావిన్సులలోనూ ముస్లిం షాపులను సీల్ చేయాలని శరణార్థి శాఖ మంత్రి మోహన్ లాల్ సక్సేనా ఆదేశించినప్పుడు నెహ్రూ మాట్లాడుతూ “మనందరం శరణార్థి మనస్తత్వానికి, ఇంకా చెప్పాలంటే ఆర్ఎస్ఎస్ మనస్తత్వానికి బందీలమై పోయాము” అని ఆగ్రహంతో వ్యాఖ్యానించారు.

మతఘర్షణల్లో పటేల్ పక్షపాత ధోరణి

కలకత్తా (ఆగస్టు 1946), నోవాకలీ (అక్టోబర్ 1946), బీహార్ (అక్టోబర్ 1946)లలో జరిగిన మతఘర్షణల్లో పటేల్ వ్యవహరించిన తీరు ఘోరంగా ఉంది. 1946 ఆగస్టు 21న పటేల్ రాజాజీకి ఉత్తరం రాస్తూ “మొత్తం శాంతి భద్రతలు కుప్పకూలిపోయాయి. కానీ పరిస్థితి చక్కదిద్దలిగే వారెవరూ లేరు. అయితే ఈ ఘర్షణల్లో ఎక్కువ మంది ముస్లింలు చనిపోయినందున ఇది ముస్లిం లీగ్‌కు ఒక గుణపాఠం అవుతుంది”. (సర్దార్ పటేల్ లేఖలు : పేజీ 49). మానవ మారణకాండ పట్ల ఎంతటి నాగరికమైన, ఓదార్పుతో కూడిన ప్రతిస్పందన ఇది!? బీహార్ మత ఘర్షణలతో నెహ్రూ చలించిపోయాడు. కానీ పటేల్‌కు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రొఫెసర్ బి.బి. మిశ్రా ఇలా రాశారు : “బీహార్ మత ఘర్షణలు జాతీయవాద ముస్లింలలో కూడా కాంగ్రెస్ తమ ప్రాణాలకూ, ఆస్తులకూ రక్షణ కల్పిస్తుందన్న ఆత్మస్థైర్యం లేకుండా చేశాయి. దానివల్ల జిన్నాకు చాలా లాభం చేకూరింది.” (భారతీయ రాజకీయ పార్టీలు, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్, 1976. పేజీ 603)

శరణార్థులు సమస్య

దేశ విభజన తరువాత ఈ భావోద్వేగాలు మరింత పెరిగాయి. ఈ సందర్భంగా పటేల్ ఢిల్లీ నుండి ముస్లింలను పంపించేయాలని కోరుకున్నారన్న విషయం, భయంతో పాకిస్తాన్ పారిపోయిన ముస్లింలు తిరిగి స్వగృహాలకు రావడాన్ని అడ్డుకున్నారన్న విషయం నేడు చాలా తక్కువగా తెలుసు. ఆ రోజుల్లో పాకిస్తాన్, భారత్‌ల మధ్య ప్రయాణాలపై నిషేధం లేదు. మంత్రివర్గ అత్యవసర కమిటీ సమావేశంలో పటేల్ ఈ విధంగా అన్నారు : “ఈ ముస్లింలు ఇక్కడి నుండి వెళ్లక పోతే మనం ఇబ్బందుల్లో పడతాం. ఎందుకంటే అప్పుడు పశ్చిమం నుండి వస్తున్న ముస్లిమేతర శరణార్థులకు ఆశ్రయం కల్పించడం కష్టమవుతుంది.” (వజీరా ఫజిలా - యాకూబ్ అలి జమీందర్ రాసిన “సుదీర్ఘ విభజన” గ్రంథం. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్. కరాచీ, 2008, పేజీ 39. పురాతన పత్ర భాండాగారాల ఆధారంగా రాసిన గ్రంథం). ప్రతిదాన్నీ పటేల్ “ప్రజాభిప్రాయం” పేరుతో చెప్పేవారు. 1947 సెప్టెంబర్ 2న ఆయన ఇలా అన్నారు : “ఢిల్లీ వీధుల్లోనూ, ఇతర పట్టణాల్లోనూ ముస్లింలను శాంతియుతంగా ఎందుకు తిరగనిస్తున్నారని ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు” అంటూ మరోమాట కూడా అన్నారు : “పోలీసుల్లోనూ, పౌర పరిపాలనా రంగంలోనూ ముస్లింలకు స్థానం ఎందుకివ్వాలని” కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారు అని అన్నారు. (సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూం 4, పేజీ 318). అంటే ముస్లింలకు కనీస మానవ హక్కులు కూడా ఉండకుండా చేయాలని పటేల్ అనుకున్నా రన్నమాట.

1948 మార్చి 4న మంత్రివర్గ నిర్ణయాలపై పటేల్‌కు నెహ్రూ ఒక లేఖ రాస్తూ, “ఢిల్లీలో ప్రస్తుతం ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలను ముస్లిం శరణార్థుల కోసం రిజర్వు చేయాలని రెండు మూడు నెలల క్రితం మనం నిర్ణయానికి వచ్చిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది” అని చెప్పారు. (పై పుస్తకం పేజీ 261). దానికి సమాధానంగా అన్నట్లు 1948 మే 4న పటేల్ నెహ్రూకు ఇలా లేఖ రాశారు : “పాకిస్తాన్ నుండి ముస్లిం శరణార్థుల రాకను అడ్డుకోలేకపోతున్నామని ప్రజలు, మరీ ముఖ్యంగా శరణార్థులు మనపై గుర్రుగా ఉన్నారు” అని పేర్కొన్నారు. (అదే పుస్తకం పేజీ 319) 1948 డిసెంబర్‌లో పటేల్, “శరణార్థులకు పునరావాసం కల్పించడం కోసం తూర్పు పాకిస్తాన్‌లో కొంత భాగం లాక్కుని భారత్ స్వాధీనం చేయాలి” అని నెహ్రూను డిమాండ్ చేశారు. (చోప్రా ఎడిట్ చేసిన 'సర్దార్ పటేల్ : ముస్లింలు, శరణార్థులు' పేజి 271). 1950 అక్టోబర్ 27న నెహ్రూ సహనం నశించి పటేల్‌కు ఇలా సమాధానమిచ్చారు : “శరణార్థుల రాక ఇలాగే కొనసాగితే పశ్చిమ బెంగాల్ నుండి అంతే సంఖ్యలో ముస్లింలను పంపడం మినహా మాకు మరోమార్గం లేదని పాకిస్తాన్ ప్రభుత్వానికి చెప్పమని మీరు సలహా ఇస్తున్నారు. అంతేనా!

“శరణార్థుల రాక మనకు పెద్ద సమస్యగా ఉందన్న విషయం నూటికి నూరుపాళ్లూ నిజం. అయితే మీరు కోరిన మందును నేను ప్రతిపాదించను. శరణార్థులు రావడానికి ప్రధాన కారణం పాకిస్థాన్‌లో దిగజారిపోతున్న ఆర్థిక పరిస్థితులు. పాకిస్తాన్ ప్రభుత్వం ఈ పరిస్థితులు మెరుగుపరిచే స్థితిలో లేదు. అయితే దీనికి విరుగుడుగా పశ్చిమ బెంగాల్ నుండి ముస్లింలను తూర్పు బెంగాల్‌కు పంపించేయాలన్న మందు వికటించి మనకు పెద్ద విపత్తు తెస్తుంది. ఇలాంటి ఆలోచనే మనకు తీవ్ర నష్టం తెస్తుంది.” (సర్దార్ పటేల్ లేఖలు. పేజీ 670-671).

పటేల్ కాంగ్రెస్ పార్టీలోని తన సహచరులైన రఫి అహ్మద్ కిద్వాయ్ వంటివారిపైనా, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీపైనా నిఘా వేసేందుకు గూఢచారి శాఖ ఇచ్చిన 'రహస్య నివేదిక కాపీ'ని 1948 ఫిబ్రవరి 6న నెహ్రూకు పటేల్ పంపారు. తనను మంత్రివర్గం నుండి తొలగించడానికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కుట్రపన్నినట్లు సృష్టించిన నివేదిక అది. “కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఈ పరిస్థితి (గాంధీ హత్య)ని ఉపయోగించుకుని కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అధికారం చేపట్టడానికి కుట్ర చేసింది” అని అందులో పేర్కొన్నారు. (సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూమ్ 6, పేజీలు 33-34) పటేల్ నిర్లక్ష్యం వల్లనే గాంధీ ప్రాణాలు పోగొట్టుకోవలసి వచ్చిందని జయప్రకాష్ నారాయణ్ చేసిన విమర్శలను చల్లార్చడానికే పటేల్ ఇటువంటి తప్పుడు నివేదికలు సృష్టించారన్నది స్పష్టం. “ప్రభుత్వంలో కూడా కమ్యూనిస్టు సెల్స్ ఉన్నాయి” అని భారతీయ మెకార్థీ అయిన పటేల్, నెహ్రూను హెచ్చరించారు. (అదే పుస్తకం పేజీ 445). దీనిలో భాగంగానే పటేల్ ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి)కి వ్యతిరేకంగా, ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ఒక కార్మిక సంస్థ - ఐఎన్‌టియుసి-ని స్థాపించారు. ఇది ఎఐటియుసిని నాశనం చేయలేక పోయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికార విభాగంగా మాత్రం పనిచేస్తోంది. (సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూం -2).

పటేల్ - కాశ్మీర్

కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాల విషయంలో పటేల్ అనుసరించిన వైఖరులు ఆయన పచ్చి మతతత్వానికి నిదర్శనాలు. కాశ్మీర్

కామ్రేడ్ మాదాల నారాయణస్వామి సంతాపసభలు

విప్లవయోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు, మాజీ పార్లమెంటు సభ్యులు, సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు కా॥ మాదాల నారాయణస్వామి ది. 9.12.2013న తన 90వ సంవత్సరంలో గుంటూరులో మరణించారు. డిసెంబర్ మాసమంతా సంతాపసభలు నిర్వహించాల్సిందిగా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. రిపోర్టులు సంక్షిప్తంగా ...

ఖమ్మం జిల్లా :

కా॥ మాదాల నారాయణ స్వామి సంతాపసభను ది. 27.12.2013న ఖమ్మం పట్టణంలోని మేకల బిక్షమయ్య ఫంక్షన్‌హాలులో నిర్వహించారు.

జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కా॥ గౌని ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సంతాపసభలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కా॥ కిష్టిపాటి వెంకటేశ్వర్లు ఉపన్యసించారు ఆయన మాట్లాడుతూ - తొలితరం కమ్యూనిస్టు నేత. కమ్యూనిస్టు విలువలకు. సిద్ధాం తాలకు, ఆచరణకు. క్రమశిక్షణకు నిఘంటువు కా॥ మాదాల నారాయణస్వామిగారు అన్నారు. 77 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏ మచ్చలేని నాయకుడని కొనియాడారు. చివరి వరకు ప్రజల పక్షాన నిలిచిన నిజమైన ప్రజా నాయకుడన్నారు. తొలితరం శాసనసభ్యుడిగా. పార్లమెంటు సభ్యుడిగా చట్ట సభల్లో ప్రజావాణిని వినిపించారన్నారు ఉద్యమ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు. అడ్డంకులు. అవాంతరాలు వచ్చినా ధైర్యంగా నిలిచిన సాహసికుడని కొనియాడారు భారత యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించడంలో. విశాఖ ఉక్కు కర్మాగారానికై ఎంపి పదవికి రాజీనామా చేయడంలో ముందు వారు నిలిచారన్నారు కా॥ ఎం.ఎన్.ఎస్. జీవితం నేటితరానికి ఒక దిక్సూచి అన్నారు. కా॥ మాదాల బాటలో నడవాలి. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయడమే కా॥ ఎం.ఎన్.ఎస్.కు నిజమైన నివాళి అన్నారు.

ఇంకా ఈ సంతాపసభలో ఎపిసిఎల్‌సి జిల్లా నాయకులు ఎం సుగుణారావు, ఖమ్మం డివిజన్ పార్టీ కార్యదర్శి కా॥ ఎం. గిరి. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కా॥ జె. సీతారామయ్య, ఎఐకెఎంఎస్ ఖమ్మం డివిజన్ అధ్యక్షులు టి. హన్మంతరావు, తదితరులు ప్రసంగించారు.

ఖమ్మం టౌన్

ఖమ్మం డివిజన్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో ది. 16.12.2013న ఖమ్మం పట్టణంలో పుల్లారావు అధ్యక్షతన సంతాపసభను నిర్వహించారు. సంతాపసభలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కా॥ గౌని ఐలయ్య ఉపన్యసించారు. సంతాపసభలో ఎం. గిరి, టి. హనుమంతరావు, ఇ. పుల్లారావు, కె. సురేష్, సైదులు, ఎన్. రాకేశ్, సిహెచ్ విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా :

భూమి, భుక్తి, విముక్తి కొరకు ప్రతిఘటనా పోరాటాలు కొనసాగించాలని సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా॥ ఎస్. రాజారావు పిలుపునిచ్చారు. ది. 24.12.2013న రంపచోడవరంలో నిర్వహించిన కా॥ మాదాల నారాయణ స్వామి సంతాపసభలో ఆయన మాట్లాడుతూ - నేటికి భూమి భూస్వాముల, బడా పెట్టుబడిదార్ల చేతుల్లోకీ కేంద్రీకృతమైనదన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు భూమి నుండి వెళ్ళగొట్టబడుతున్నారని ఆవేదన చెందారు. దేశంలో దున్నేవానికే భూమి దక్కాలనే నినాదంతో వ్యవసాయక విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేయడమే కా॥ మాదాల నారాయణస్వామికి నిజమైన నివాళి అన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ రైతు - కూలీ సంఘం ఏర్పాటు చేశారు. అనంతరం అఖిల భారత రైతు - కూలీ సంఘంగా విస్తరించడంలో ఆయన సేవలు నిరుపమానమైనవన్నారు. కా॥ ఎం.ఎన్.ఎస్. సంపూర్ణ కమ్యూనిస్టు అని, నిజమైన విప్లవకారుడని కొనియాడారు. ఈ సందర్భంగా కా॥ ఎం.ఎన్.ఎస్.గారి జీవితాన్ని సోదాహరణంగా వివరించారు. కా॥ ఎం.ఎన్.ఎస్. బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కా॥ కంగల బాల్‌దొర అధ్యక్షతన జరిగిన సంతాపసభలో ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంతాపసభనుద్దేశించి రంపచోడవరం పార్టీ డివిజన్ నాయకులు కా॥ పల్లాల అశోక్ మాట్లాడారు. అనంతరం రంపచోడవరంలో ప్రదర్శన నిర్వహించారు. సంతాపసభలో పి. అనసూయ. ఐ రమణ, వి. వాసు. కె. మురళి. ఐ. బాలురెడ్డి, కె. భాను ప్రసాద్. పి లచ్చిరెడ్డి. ఆదిలక్ష్మి. కె. బాపన్న. పి. సురేష్, మడకం జోగయ్య. తదితరులు 200 మంది పాల్గొన్నారు

గుంటూరు జిల్లా

మూడు తరాల వారధి. మూడు విప్లవాల సారథి. విప్లవోద్యమ పెద్ద దిక్కు కా॥ మాదాల నారాయణస్వామి సంతాప సభ 2013 డిసెంబర్ 30న పార్టీ గురజాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురజాల పట్టణంలో కా ॥ నందనం వెంకట్రావు నగర్‌లో 200 మందితో జరిగింది. ఈ సభకు ముందుగా కా॥ ఎం.ఎన్.ఎస్.కి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్. బ్రహ్మయ్య మాట్లాడుతూ - భూపంపకం, దళితుల సమస్య, ఆదివాసీల సమస్యలపై నిరంతరం కా॥ మాదాల పోరాడారని అన్నారు. విప్లవ పోరాట యోధుడు, ఆదర్శ కమ్యూనిస్టుగా కా॥ మాదాల నారాయణస్వామి తన జీవితాన్ని పేద ప్రజల విముక్తి కోసం అంకితం చేశాడని అన్నారు. తాను నమ్మిన మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం భారత దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించాలని ప్రతిక్షణం పరితపించారు. 1950 సెప్టెంబర్ 13న తన తమ్ముడు కోటయ్యను ఎన్‌కౌంటర్‌లో కోల్పోయారు. అయినా చివరి శ్వాస వరకు నిబద్ధతతో పనిచేసిన, మచ్చలేని ఉత్తమ కమ్యూనిస్టు అని ఘనంగా నివాలులు అర్పించారు. ఈ సభకు పార్టీ డివిజన్ నాయకురాలు ఎన్. సామ్రాజ్యం అధ్యక్షత వహించారు. ఇంకా ఈ సభలో ఎఐకెఎంఎస్ గురజాల మండల కార్యదర్శి కా॥ బత్తుల రామకృష్ణ, పీవోడబ్ల్యూ నాయకులు రమాదేవి, వెంకట్రావ్‌నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్.కె. నబి, సహాయ కార్యదర్శి ఉన్నం నర్సింహారావు, వల్లిపోయిన రాములు, పార్టీ 19వ వార్డు అభ్యర్థిని కత్తి జ్ఞానమ్మ తదితరులు ప్రసంగిస్తూ కా॥ మాదాల నారాయణస్వామి ఆశయ సాధనకు మనమంతా ప్రతిన బూనాలని నివాలులు అర్పించారు. ఈ సభలో అరుణోదయ కళాకారులు విప్లవ గీతాలతో ప్రజలను ఉత్తేజపరిచారు.

జగ్గంపేట

తొలితరం కమ్యూనిస్టు నేత, ఆదర్శ కమ్యూనిస్టు కా॥ మాదాల నారాయణస్వామిగారికి విప్లవ జోహార్లర్పిస్తూ జగ్గంపేటలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆయన సంతాపసభ జరిగింది. ఆ సభకు ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మరుకుర్తి ఏసు అధ్యక్షత వహించగా న్యూడెమోక్రసీ జిల్లా సీనియర్ నాయకులు ఎస్. రాజారావు ముఖ్య వక్తగా ప్రసంగించారు. ఇంకా ఈ సభలో ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె. లక్ష్మి, జి. ఆదినారాయణ, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వి. చిట్టిబాబు. పీవోడబ్ల్యూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వి. శాంతి. పీవైఎల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. బాలరాజు ప్రసంగించారు.

సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఎస్. రాజారావు మాట్లాడుతూ కా॥ మాదాల నారాయణస్వామి 9.12.2013న ఉదయం 9 గంటలకు తుదిశ్వాస విడిచారు ఆయన 1936 నుండి ఈనాటి వరకు అనగా 77 సంవత్సరాల కమ్యూనిస్టు కార్యకర్తగా. విప్లవ నాయకుడిగా దేశంలో, రాష్ట్రంలో. గుంటూరు జిల్లాలో పీడిత, తాడిత జనం కోసం, అవిశ్రాంతంగా పోరాడుతూ తుదిశ్వాస విడిచారని అన్నారు. ఆయన ఉన్నత చదువులు చదివి విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1992 నుండి పార్టీలో తలెత్తుతున్న మితవాద పోకడల పట్ల, రివిజనిస్టు ధోరణుల పట్ల ప్రతిఘటనా పోరాట వ్యతిరేక ధోరణులను, సాయుధ దళాలను వ్యతిరేకించే ధోరణులను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. విప్లవశ్రేణులకు ప్రేరణగా నిలిచారు. గుంటూరు, పల్నాడు, నెల్లూరు, గూడూరులలో జరిగిన అన్ని భూ పోరాటాల్లో ఆయన పాత్ర ఎనలేనిదనీ, ఆయన చూపిన బాటలో నడవాలని కా॥ రాజారావు పిలుపునిచ్చారు.

ఈ సంతాప సభలో టైల్స్ వర్కర్స్ కార్మికులు, భగత్‌సింగ్ నగర్, కట్టమూరు, గోనేడ, బూరుగుపూడి, సైకిల్ షాపు వర్కర్సు, కాట్రావులపల్లి, తిమ్మాపురం గ్రామాల నుండి 200 మందికి పైగా రైతు కూలీలు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు 2 ని॥లు మౌనం పాటించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, బొడ్డు రాంబాబు, బ్రహ్మయ్య, సరస్వతి, పార్వతి, వెంకటలక్ష్మిలు పాల్గొన్నారు.

విషయంలో పటేల్ ఆర్ఎస్ఎస్ అధినేత ఎం.ఎస్. గోల్వాల్కర్‌ను ఒక సాధనంగా వాడుకున్నారు. అప్పటికే ముస్లింలను ఊచకోత కోయడానికి గోల్వాల్కర్ వేసిన పథకానికి సంబంధించిన పత్రాలు ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌దయాళ్‌కు పట్టుబడ్డాయి. అయితే గోల్వాల్కర్‌ను అరెస్టు చేయకుండా పంత్ అడ్డుపడ్డారు. అటువంటి గోల్వాల్కర్‌ను కాశ్మీర్ రాజువద్దకు రాయబారిగా పంపారు పటేల్. దీనికి సంబంధించి న్యూఢిల్లీలోని అమెరికా రాయబారి వాల్టర్ అండెర్సన్ రాసిన "కాషాయంలో సహోదరత్వం" (విస్తార్, 1987) పుస్తకంలో చాలా చక్కగా వివరించారు. ఆర్ఎస్ఎస్ వాళ్ల స్వంత పత్రాల ఆధారంగా ఆయన ఈ పుస్తకం రాశారు. అందులో ఇలా రాశాడు : "కాశ్మీర్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసే విషయమై సంస్థానానికి చెందిన హిందూ మహారాజును ఒప్పించేందుకు హోమ్ మంత్రి వల్లభాయి పటేల్, గోల్వాల్కర్ సహాయాన్ని అభ్యర్థించారు. గోల్వాల్కర్ 1947 అక్టోబర్‌లో మహారాజును కలిసి ఆయన సైన్యంలోకి పంజాబీ హిందువులనూ, సిక్కులనూ చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు." (పేజీ 49).

పటేల్ దృష్టిలో "కాశ్మీర్ అనేది ముస్లిం ప్రాంతంలో ఉన్న హిందూ సంస్థానం". మెజారిటీ ముస్లిములున్న ఈ సంస్థానాన్ని ఆ విధంగా ఆయన ఎలా నిర్వచిస్తారో ఎవరికీ అర్థం కాదు. (సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూం 1, పేజీ 4). నెహ్రూ మాత్రం "ఆయనను హిందువుగా, అయితే కాశ్మీరీ హిందువుగా పరిగణించేవారు." (అదే పుస్తకం, పేజీ 3). ఉప ప్రధాన మంత్రిగా, హోమ్ మంత్రిగా పటేల్ కాశ్మీర్ మహారాజును సమర్థించేవారు. మహారాజుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజా నాయకుడైన షేక్ అబ్దుల్లానూ, ప్రజా ట్రిబ్యునళ్లనూ వ్యతిరేకించేవారు. భారత యూనియన్‌లో కలిసిపోవడానికి కాశ్మీర్ మహారాజును ఒప్పించేందుకు ప్రయత్నించేవారు. చివరికి 1948 జనవరి 31వ తేదీన కాశ్మీర్ రాజు తను స్వతంత్ర దేశంగా విడిపోతానని బెదిరించినప్పటికీ పటేల్ ఆయన పట్ల సానుకూలంగానే ఉండేవారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల పట్ల నెహ్రూ ఫిర్యాదు చేస్తే పటేల్ దాన్ని సమర్థించేవారు. పటేల్‌కు నలుగురిమీద గురి ఉండేది. వారు ... కాశ్మీర్ రాజు హరిసింగ్, ఆయన దీవాన్, మతతత్వవాది అయిన మెహెర్ చంద్ మహాజన్, ఇన్‌ఫర్మేషన్ బ్యూరో అధినేత బి.ఎన్. ముల్లిక్,. ముల్లిక్‌ను పటేల్ ఎంతగా చేరదీశారంటే తన రిపోర్టులను ఆయనచేత రాయించేవారు. ('లంచాలు, గూఢచారులు' వ్యాసం, ఫ్రంట్‌లైన్, నవంబర్ 29, 2003).

1952లో కలకత్తాలో జరిగిన ఒక ప్రదర్శనలో నెహ్రూ ప్రసంగిస్తూ, "ఈనాడు జనసంఘ్, లేక ఇంకేదైనా మతతత్వ పార్టీ అధికారంలో ఉండి ఉంటే కాశ్మీర్ విషయంలో ఏం జరిగేదో చూడండి. జనసంఘ్, ఆర్ఎస్ఎస్‌లు నిరంతరం దాడులు చేస్తూ ఉంటే వాళ్లు (కాశ్మీరీ ప్రజలు) మనతో ఎందుకు ఉండేవారు, ఇంకెక్కడికైనా వెళ్లిపోయేవారు." (జవహర్‌లాల్ నెహ్రూ 'ఎంపిక చేసిన రచనలు' వాల్యూం 17, పేజీలు 77-78).

నెహ్రూ కాకుండా నాడు వల్లభాయ్ పటేల్ ప్రధాన మంత్రి అయ్యుంటే వాళ్లు ఖచ్చితంగా భారత్‌తో ఉండకుండా వెళ్లిపోయే వారు. షేక్ అబ్దుల్లాను భారత్‌కు చేరువ చేసింది. గాంధీ, నెహ్రూల లౌకిక తత్వమేగాని, పటేల్ హిందూ అనుకూల దృక్పథం కాదు.

కాశ్మీర్‌లో మాదిరిగానే హైదరాబాద్‌లో జరిగింది. పండిట్ సుందర్‌లాల్ ఆయన సహచరులు సమర్పించిన నివేదికలో హైదరాబాద్ సంస్థానంలో ముస్లింలపై మారణకాండ సాగిందని రాశారు. నివేదిక పట్ల ఆయన పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాన్ని పట్టించుకోలేదు. ఆయన హైదరాబాద్‌లో భారత ఏజెంట్ జనరల్‌గా కె.ఎం. మున్షీని నియమించారు. పోలీసు చర్య పేరుతో తెలంగాణాలో ప్రజలపై యుద్ధం చేశారు. ఈ మొత్తం రికార్డులను బట్టి సర్దార్ వల్లభాయ్ పటేల్ పచ్చి మతతత్వవాది అని తేలడం లేదా? ముస్లింలంటే ఆయనలో ఉండే ప్రతికూలత రానురాను పచ్చి వ్యతిరేకతగా మారింది. ఈ వ్యతిరేకత ఆయనను ముస్లిం వ్యతిరేక నాయకునిగా మార్చేసింది.

ముస్లింల రక్తం తాగడానికి సిద్ధపడ్డ ఆర్ఎస్ఎస్, మహాసభలకు ఆయనను సన్నిహితుని చేసింది. ఇదంతా విస్మరించి నేడు పటేల్‌ను ఉక్కు మనిషి అని పొగడడం, అదే సమయంలో నెహ్రూను తెగనాడడం జరుగుతోంది. నెహ్రూ ఈ ప్రమాదాన్ని చాలా ముందుగానే కనిపెట్టారు. "కొంత మంది కాంగ్రెస్ హిందువులు ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నారు. ఇందులో మానసికమైన అంశాలే ముఖ్యమైనవి" అని 1945 జులై 14న నెహ్రూ వావెల్‌కు చెప్పారు. ఇది పటేల్‌కు బాగా వర్తిస్తుంది. అందుకే పటేల్‌లోని మతతత్వ వాది దాచేద్దామన్నా దాగడు.

నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గాన్ని వదిలేసి రివిజనిస్టు మార్గం పట్టినవాళ్లు విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించలేరు

సైద్ధాంతిక, రాజకీయ విభేదాలే ఇప్పటి తాజా చీలికకు కారణం

ఎస్.కె. ముఖ్తార్ పాషా

[illegible] రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

(1.12.2013 సంచిక తరువాయి భాగం)

ఇక రంగాలకు రంగాలు, జిల్లాలకు జిల్లాలు అన్నీ వారిపక్షమే ఉన్నాయని వ్యాసకర్త పోటు ప్రసాద్ పేర్కొన్నారు. ఒకటి రెండు వాస్తవాలు పేర్కొని వాటి చుట్టూ అబద్దాల దొంతర్లు అల్లి పేకమేడలు కట్టారు. ఓడీ. జూటు రంగాలలో ప్రధానంగా వారే ఉన్నారనేది వాస్తవం. మేము ఈ రంగాలలో మరో సంఘం పెట్టకపోవటం అంటే ఈ రంగాలలో మాకు స్థానం లేదని కొట్టి పారేయటం ఎంత మాత్రం వాస్తవం కాదు. తగిన సంఖ్యలో మాకూ కార్మికులున్నారు. సమయం వచ్చినప్పుడు ప్రసాద్‌గారే చూస్తారు. బొగ్గు, హమాలీ, మోటార్, మున్సిపల్, మిల్స్, బి.ఓ.సి అత్యంత బలహీనం అని పేర్కొన్నారు. ఇంత కన్నా పెద్ద అబద్ధం మరొకటి లేదు. వాస్తవానికి బొగ్గు రంగంలో రాయల వర్గం స్థానమే అత్యంత బలహీనం. పోటు ప్రసాద్‌గారు ప్రజాపంథా పాఠకులకే కాక వారి శ్రేణులకు కూడా ఇంకా పచ్చి అబద్దాలే నూరిపోయదలచుకున్నారు. ఇలాంటి తప్పుడు రాతలకు రేపటి చరిత్రే సమాధానం చెబుతుంది. ఇక హమాలీ, మోటార్, మున్సిపల్, మిల్స్, బి.ఓ.సి తదితర రంగాలలో కుడి. ఎడంగా ఇద్దరి స్థానం ఒకే రకంగా ఉంది. విజయవాడ. హైద్రాబాద్‌లలో ఆటో తదితర రంగాలలో వారి స్థానం బలహీనంగా ఉన్నప్పటికీ వ్యాసకర్త త్రీడీలో పెట్టి చూపిస్తున్నారు

ఇక రైల్స్ రంగం ఖమ్మం జిల్లాలో "సగం మొగ్గింది" అని రాసుకున్నారు. వ్యాసకర్త వేసే ఇలాంటి 'పిడికెల పందిళ్లకు'. 'గాలిలో కట్టే మేడలకు' కాలమే సరైన సమాధానం చెబుతుంది. ఇక జిల్లాల పరిస్థితి గురించి కూడా ఇలానే రాసుకున్నారు. అనంతపురం, కర్నూలు తదితర కొన్ని జిల్లాలలో మాకు స్థానంలేదని రాసారు. కానీ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు తదితర జిల్లాలలో వారికి స్థానం లేని విషయాన్ని మాట వరుసకు కూడా పేర్కొనలేదు. ఆదిలాబాదు, కరీంనగర్‌లలో వారి పరిస్థితి తలకిందులవుతుండగా పూర్తి విరుద్ధంగా రాసుకున్నారు. ఇక ఖమ్మం జిల్లా గురించి పోటు ప్రసాదు ఊహల పల్లకిలో విహరించటమే కాకుండా వారి శ్రేణులను సైతం విహరింపచేయడానికి పడరాని పాట్లు పడ్డారు. అనేక పదవిన్యాసాలకు పాల్పడ్డారు. పోటు ప్రసాద్ ఉపన్యాసాలు వినే కావచ్చు "ది. 13.9.2013న కొత్తగూడెంలో వెయ్యిమందితో బహిరంగ సభ" అని పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. చివరికి 300 మందికి సంఖ్య మించలేదు. ఇందులో సగం మంది రైతు, కూలీలే ఉండటం విశేషం. అక్టోబర్ 30న టేకులపల్లిలో "మోటార్ మహాసభ" అని ప్రచారం చేసి గ్రామీణ హమాలీలు. రైతు, కూలీలను రప్పించి అయ్యిందనిపించుకున్నారు. డిసెంబర్ 12న "5వేల మందితో ఇల్లందులో కార్మిక ర్యాలీ" అని ప్రచారం చేసుకొని 300 మంది రైతు - కూలీలే హాజరు కావటం విశేషం. వారి ప్రచారాలకు ఇవి కొన్ని మచ్చుతునకలే.

వారి ప్రచారాలకు, వాస్తవాలకు మధ్య భూమ్యాకాశాలకు మధ్య దూరం ఉంటున్నది. ఎన్నికలకు ముందు బూర్జువా రాజకీయ పార్టీలు తమ బలాబలాలకు సంబంధించి చేసుకునే కల్పిత ప్రచారాలకు మించిన ప్రచారాన్ని చేసే కర్తవ్యాన్ని వ్యాసకర్త ఎత్తుకున్నారు. వారి జిమ్మిక్కులకు కాలమే సరైన సమాధానం చెబుతుంది. అప్పటి వరకు వేచి చూసే ఓపిక మాకుంది.

"కవ్వింపు వైఖరిని కూడా వారు చేపట్టవచ్చు", "కొన్ని అవాంచనీయమైన లేదా అనుచితమైన దుష్ప్రచారాలకు కూడా దిగవచ్చు" అని పోటు ప్రసాద్ ముందుగానే పేర్కొంటున్నారు. "అయినా కుక్కకాటుకు చెప్పుదెబ్బ, కంటికి కన్ను, పంటికి పన్ను తరహా ప్రతీకార పద్దతులకు పాల్పడనక్కరలేదు" అని పోటు ప్రసాద్ రాస్తున్న రాతల అర్థాలేమిటి? ఏమీ లేకుండా "కావచ్చు" అంటూ ఇలాంటి భాషతో రాతలు రాయాల్సిన ఆగత్యం పోటు ప్రసాద్‌కు ఎందుకు పట్టింది? "ఓర్పు", "విజ్ఞత" అంటూ నీతి సుద్దులు చెబుతున్న పోటు ప్రసాద్ ఆచరణలో చేయిస్తున్నదేమిటి? ఒక్క విషయాన్ని ఇక్కడ పేర్కొనదలచాము. ఉమ్మడి పార్టీతో ఆదిలాబాదు జిల్లా కమిటీ సభ్యుడు కా॥ చాంద్‌పాషా ది. 16.10.2013న రాయలవర్గం బొగ్గుగని కార్మిక సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా (అతని అభిప్రాయాలు, భావాలతో నిమిత్తం లేకుండా) ఎన్నికయిన వ్యక్తి. కా॥ చాంద్‌పాషా, రాయలవర్గం రివిజనిస్టు రాజకీయాలపై నిర్దిష్ట వ్యతిరేకతను వ్యక్తపరిచిన వ్యక్తి. కా॥ చాంద్‌పాషా. నవంబర్ 1వ తేదీన కా॥ చాంద్‌పాషా గోదావరిఖనిలో మా రాష్ట్ర సమావేశంలో పాల్గొని బెల్లంపల్లి వెళుతుండగా గుండాల్లాగా దారికాచి దౌర్జన్యంగా తన మోటార్ సైకిల్ లాక్కున్నారు. భౌతిక ఘర్షణలకు, కవ్వింపు చర్యలకు శ్రీకారం చుట్టేందుకు పూనుకున్న చర్య ఇది. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వీరి రాతలకు చేతలకు పూర్తి విరుద్ధమనేదానికి ఈ ఒక్క ఘటన పేర్కొనడం చాలనుకుంటున్నాను.

ఇక చీలికలు, ఐక్య కార్యాచరణల గురించి వ్యాసకర్త పేర్కొన్నారు. చీలికలైనా, ఐక్యతలైనా నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలపై ఆధారపడి మాత్రమే ఉండాలని మేము భావిస్తున్నాము. నూతన ప్రజాస్వామిక విప్లవమే అక్కరలేదనుకున్నాక, రివిజనిస్టు విధానాలను ఎత్తుకున్నాక అలాంటి శక్తులతో ఐక్యతంటూ అంటకాగాల్సిన అవసరం మాకు లేదు. ఇక ఐక్య కార్యాచరణ గురించి రాస్తున్నారు.

అసలు గత 25 సంవత్సరాలలో ఏ విప్లవ సంస్థలతో ఐక్య కార్యాచరణ చేశామ్?. నిత్యం రివిజనిస్టు సంస్థలతో ఐక్య కార్యాచరణకు పరుగులు పెడుతుంటే జాతీయ కమిటీ నిత్యం కళ్లెం వేయటమే పనిగా తీర్మానాలు చేయాల్సి రాలేదా?

నెల్లిమర్ల ఉద్యమ విషయంలో సైతం జాతీయ కమిటీ తప్పుడు నిర్ణయాలను చేసిందని పోటు ప్రసాద్‌గారు రాసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చినది? ఇలాంటి విషయాలు కోకొల్లలు ఉన్నాయి. బలాబలాలకు మీ బీడీరంగం సభ్యత్వమే గీటురాయి. అయితే దాని గురించి మేము విచారించదలచుకోలేదు. రివిజనిస్టులతో కూడా పోలిక లేని సంస్కరణవాద సంఘంగా మార్చిన మీ బీడీ సంఘం గురించి మేము నేర్చుకోవాల్సింది ఏమీ లేదు. ఇలాంటి రివిజనిస్టు విధానాలతో సమరశీల కార్మికోద్యమాలను నిర్మించటం సాధ్యం కాదు. అందుకే నూతన ప్రజాస్వామిక లక్ష్యమే ఇప్పు తాజా చీలికకు పునాది అని మరో మారు గుర్తు చేసుస్తున్నాము. ఈ లక్ష్యంతోనే విప్లవ కార్మికోద్యమ నిర్మాణానికి పునరంకితమవుతాం.

(అయిపోయింది)

(6వ పేజీ తరువాయి)

సుమారు 20,000 మంది రైతు కూలీలతో ర్యాలీ, బహిరంగ సభ జరిగాయి. ఆ సందర్భంగా సభ నిర్వహణ పూర్తయిన తర్వాత దానికోసం సేకరించిన విరాళాలలో 18,000 రూ.లు మిగిలినప్పుడు వాటిని సంఘ కేంద్ర కార్యవర్గానికే అప్పగించాం. దానిపై ఆయన ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆ సభల్లో ఆయన కేంద్ర అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అయితే ఆ సంఘం నిర్వహణలో తగిన సహకారం అందక ఆయన చాలా బాధపడ్డారు.

మరో దఫా కూడా - వ్యూహాత్మక ప్రాంతాల ఉద్యమాల పట్ల కూడా అంతర్జాతీయ వేదికలపై చర్చలలో మన పార్టీ తరపున పాల్గొన్నప్పుడు యితర పిలిప్పైన్స్ దేశాల వంటివి - తనను "మీరు సాయుధ పోరాటం ఎందుకు నిర్మించలేకపోతున్నారంటూ ప్రశ్నించారన్నారు. మన వద్ద ఈ జనం (మెజారిటీ పి.సి.) అవగాహన దృష్ట్యా అక్కడ ఏమీ హామీ ఇవ్వలేని పరిస్థితి వుందని, హామీ ఇస్తే ఇక్కడ అమలవుతుందనే గ్యారంటీ లేదంటూ కా॥ ఎం.ఎన్.ఎస్. బాధను వ్యక్తం చేశారు.

కా॥ ఎం.ఎన్.ఎస్.లో నాకు నచ్చిన మరో అంశం :

సమావేశాలలో వాద వివాదాల సందర్భంగా తన పెద్దరికంతో, అనుభవాలతో ఇతరులకు నచ్చజెబుతూ ఎంతో హుందాగా వ్యవహరించేవారు. ఒకటి, రెండు ఉదాహరణలు :

2005 ఎఐకెఎంఎస్ కేంద్ర మహాసభ ప్యానల్ 9 మందితో ప్రతిపాదించాలనుకున్నారు. ఆంధ్ర నుండి ఈ రాష్ట్ర అధ్యక్ష - కార్యదర్శులిద్దరినీ అందులో వుంచారు. నిజానికి నేను రాష్ట్ర అధ్యక్ష స్థానంలో వున్నప్పటికీ అదే సమయంలో కొత్తగా ఆ రంగంలోనికి మారాను (మార్చబడ్డాను). అప్పటి వరకు - ఉద్యమంలోనికి వచ్చిన మొదటి నుండీ పార్టీ పేరుతో పార్టీ కార్యకర్తగానే పనిచేస్తూ వచ్చాను. నాకంటే ఆ రంగంలో ముందు నుండి పనిచేస్తున్న సీనియర్ తూర్పుగోదావరి జిల్లా సభ్యులే వున్నారు. అందుకని నన్ను ప్యానల్‌లో వుంచవద్దని, అతన్ని వుంచమని నాయకత్వం సంప్రదించినప్పుడు కోరాను. నేను రెండో కామ్రేడ్‌ను వద్దంటున్నానేమోననుకుని కా॥ ఎం.ఎన్.ఎస్.గారు ఆ కామ్రేడ్ పునాది వర్గాల నుండి వచ్చిన ఆదివాసీ తెగ కామ్రేడ్ కదమ్మా. అతనైతే మంచిది కదా అని నాకు నచ్చజెప్పబోయారు. అతనిని తప్పకుండా తీసుకోవాల్సిందే. నాకు దానిపై ఎలాంటి అభ్యంతరం లేదని, నేను స్వచ్ఛందంగా నా బదులు రెండో కామ్రేడ్‌ను ప్రతిపాదిస్తున్నాని పట్టుబట్టాను. అయినా నన్ను ప్రక్కకు వుంచడం యిష్టం లేక ప్యానల్‌ను 11 మందికి పెంచి నేను ప్రతిపాదించిన సభ్యుణ్ణి కూడా కేంద్ర కార్యవర్గంలోనికి తీసుకున్నారు. ఈ విషయం బాధ్యులకు తప్ప ఎవరికీ తెలియదు. అయితే నేనెవరినయితే ప్రతిపాదించానో అతను యిటీవలి మహాసభల నుండి నేటి వరకు అపసవ్య విధానాలను అనుసరిస్తూ మాపై దారుణమైన దుష్ప్రచారం చేస్తున్నాడు. అదో విషాదం! నేను ప్రతిపాదించాను గనుక నన్ను విమర్శించకూడదని కాదు. సత్యంపై ఆధారపడి వాస్తవాలను గ్రహించి వ్యవహరించాలి అంతే.

అలాగే ఒక దఫా రాష్ట్ర కమిటీ సమావేశంలో మినిట్స్ రాసేటప్పుడు (జనరల్‌గా ముగ్గురమే రాసేవాళ్ళం). ఒక కామ్రేడ్ తాను చెప్పినది సరిగా రాయలేదని తీవ్ర విమర్శ చేశారు. నిజానికి ఆయనది అపోహే. మేము వివరణ యిచ్చినా వినలేదు. దానితో ముగ్గురం మినిట్స్ రాయకుండా బాయ్‌కాట్ చేశాం. అప్పుడు కా॥ ఎం.ఎన్.ఎస్.గారు బుజ్జగించి, నచ్చచెప్పడంతో మళ్ళీ రాశాం. అలా కా॥ మాదాల నారాయణస్వామిగారు ఆల్‌రౌండర్‌గా అన్ని విషయాలలో అత్యధికం సానుకూల విషయాలున్న విప్లవయోధులు. తన నిండు జీవితాన్ని పీడిత ప్రజల కోసం రెండు తరాలుగా రెండు విప్లవాల సమయంలో నిరంతరాయంగా జీవితాన్ని అర్పించారు. విప్లవోద్యమానికి ఆయన మరణం తీవ్ర నష్టం. అసంపూర్తిగా వదిలిన ఆయన ఆశయాల పరిపూర్తికి శక్తివంచన లేకుండా కృషి చేద్దాం. - నూతన ప్రజాస్వామిక విప్లవ పరిపూర్తికి పాటుపడదాం.

- కామ్రేడ్ మాదాల నారాయణస్వామి గారికి విప్లవ జోహార్లు!

- అమరవీరుల ఆశయాలను సాధిస్తాం సాధిస్తాం!

- నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

14.12.2013

KWA 102 m322

పోడు భూములకు పట్టాలు, భూగర్భ గనులు, బయ్యారంలో స్టీలు ప్లాంటు, స్వయం పాలనా మండలుల ఏర్పాటు, 1/70 చట్టం అమలు కోరుతూ పోలవరం ప్రాజెక్టు, ఓసిపిలు, ఖనిజ దోపిడీలకు వ్యతిరేకంగా ఇల్లందులో కదంతొక్కిన ఆదివాసీలు, పేదలు

8 వేలమందితో ప్రజా ప్రదర్శన, 12 వేల మందితో బహిరంగ సభ

బయ్యారం పెద్దచెరువు కట్ట తెగితే నీరు పరవళ్ళు తొక్కినట్లుగా పరుగులు పెడుతున్న జనవాహిని అక్కడ. ఎంతో కాలంగా అణిచివేస్తే సంకెళ్ళను తెంచుకొని పరుగులు పెట్టిన వాతావరణం అక్కడ. విప్లవ రాజకీయాల పక్షం వహించే మనిషొక్కడు కూడా లేడక్కడంటూ ఆరు నెలలుగా ఒక కుహనా పక్షం ప్రచారం చేస్తుంటే మేమున్నామంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించిన వాతావరణం అక్కడ. ఆ బొగ్గుట్ట నల్ల బంగారానికే పుట్టినిల్లు కాదు. అది పోరాటాల పురిటి గడ్డకూడా. విప్లవ ప్రజా ఉద్యమాల కేంద్రమది. ఎందరో అమరవీరులను తన కడుపులో దాచుకున్న కేంద్రమది. ఇది విప్లవ ప్రజాపోరాటాల కేంద్రమని, ప్రతిఘటనా పోరాట ఉద్యమాల కేంద్రమని మరోసారి చాటి చెప్పిన వేళ అది. అదే 2013 డిసెంబర్ 13న ఖమ్మం జిల్లా ఇల్లెందులో వేలాది మంది ప్రజలు ప్రజావాహినిగా పరుగు పెట్టారక్కడ. ఇల్లందు జె.కె. కాలనీ సి.ఇ.ఆర్ క్లబ్ గ్రౌండ్ నుండి ఎర్రజెండాలు చేతబూనిన వేలాది మంది భారీ ప్రదర్శనగా బయలు దేరారు. ప్రదర్శనకు ముందు డప్పు నృత్యాలు, ఆదివాసీల డోలీలు, నృత్యాలు, కొమ్ము నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల నేతలు ప్రదర్శన అగ్రభాగాన నాయకత్వం వహించగా ఇల్లందు పట్టణ ప్రధాన రహదారిపై ప్రదర్శన పరవళ్ళు తొక్కింది. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఆదివాసీ గిరిజన ప్రజలపై అటవీ శాఖ దాడులు నిలిపివేయాలని, ఉపాధి, ఉద్యోగాలు కల్పించే భూగర్భ గనులనే తీయాలని, విధ్వంసానికి కారణమయిన ఒసిపిలను నిలిపివేయాలని, ఆదివాసీలను, గ్రామాలను ముంచుతున్న పోలవరం ప్రాజెక్టును నిలిపి వేయాలని, బయ్యారంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే స్టీలు ప్లాంటు ఏర్పాటు చేయాలని, రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు ప్రాంతాలలో స్వయం పాలనా మండళ్లు ఏర్పాటు చేయాలని, 1/70 చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, బీడీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని, ఖనిజ దోపిడీని నిలిపి వేయాలని వేలాది గొంతులు ప్రదర్శనలో నినదించాయి. సిఇఆర్ క్లబ్ నుండి ప్రారంభమయిన ప్రదర్శన జెకె బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, జగదాంబ సెంటర్, పాత బస్టాండు, బుగ్గవాగు నుండి బస్టాండు గ్రౌండ్‌లోని బహిరంగ సభా స్థలానికి చేరుకున్నది.

ప్రజా ప్రదర్శన బహిరంగ సభ స్థలానికి చేరుకోవటమే కాకుండా మరికొన్ని వేల మంది ప్రజలు సభాస్థలికి చేరుకున్నారు. డివిజన్, జిల్లా ప్రజలకు సంబంధించి ముఖ్యమైన సమస్యలపై సభ జరుగుతున్నప్పటికీ ఆనాటికి గల రాజకీయ పరిస్థితి సభకు ఒక ప్రత్యేకతను కల్పించింది. సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ సైద్ధాంతిక రాజకీయ విభేదాల కారణంగా చీలిక ఏర్పడిన ఆరు మాసాల అనంతరం జరుగుతున్న సభ అది. ఖమ్మం జిల్లా అన్నా, ఇల్లందు ఉద్యమం అన్నా 'రాయల వర్గానిదే' అని ప్రచారం చేసుకుంటున్న పరిస్థితి అది. అనేక పర్యాయాలు ఎం.ఎల్.ఏగా గెలిచిన గుమ్మడి నర్సయ్య కూడా రాయల వర్గమే కనుక ఇల్లందు ఉద్యమం 'రాయల వర్గం' వెనకనే ఉందేమోనని భావిస్తున్న వేళ అది. అందుకే బహిరంగ సభలో భాగస్వాములు కావడానికి వచ్చిన ప్రజానీకమే కాకుండా ప్రత్యేక ప్రాధాన్యత రీత్యా సభ వినడానికి, తిలకించడానికి, పరిశీలించడానికి వచ్చిన వారు ఇందులో 20 శాతం వరకు ఉంటారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల అన్ని రాజకీయ పక్షాల శ్రేణులే కాకుండా ప్రధాన నాయకత్వం సైతం ఆసక్తిగా రావటం ఈ సభ యొక్క ప్రత్యేకతగా చెప్పక తప్పదు. ఇఫ్టూ అనుబంధ ఆటో & మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సింగరేణి ఒ.బి. విభాగం నాయకుడు కా॥ ఎం.డి. రాసుద్దీన్ వక్తలను వేదికపైకి ఆహ్వానించగా బహిరంగ సభ ప్రారంభమైంది.

సభకు అధ్యక్షత వహించిన సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కా॥ ఎస్.కె. ముఖ్తార్ పాష సభ ఉద్దేశాన్ని వివరించారు. ఈ ప్రధాన సమస్యల పరిష్కారానికై కలిసి వచ్చే శక్తులతో కలిసి ఉద్యమాన్ని నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రధానంగా ఆదివాసీ, గిరిజన సంఘాలు, విప్లవ సంస్థలతో కలిసి పని చేయడానికి ప్రాధాన్యత నిస్తామని ప్రకటించారు.

సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు కా॥ సాధినేని వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రభుత్వం, సింగరేణిలు వేలం వెర్రిగా తీసుకు వచ్చిన ఒ.సి.పి వల్ల వ్యవసాయం, పంటలు, జన జీవనం, ఆరోగ్యాలు, పర్యావరణం సర్వం విధ్వంసం అవుతున్నవని కావున వీటిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. భూగర్భ గనుల ద్వారా బొగ్గును తీస్తూ ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలన్నారు. 1964లో సిపిఐ, 1947లో సిపిఎంలు ముందుకు తెచ్చిన రివిజనిస్టు విధానాలలాగానే న్యూడెమోక్రసీలో కూడా రాయల వర్గం రివిజనిస్టు విధానాలను దొడ్డిదారిన అమలులో పెట్టిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారి విధానం అభివృద్ధి చెందుతున్నదని, దేశంలో విప్లవ పరిస్థితి లేదని, తదితర అనేక రివిజనిస్టు విధానాలను ముందుకు తేవడమే కాకుండా, కేంద్రీకృత ప్రజాస్వామిక విధానాలకు భిన్నంగా అమలులో పెట్టారని పేర్కొన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంగా అమరుల బాటలో సాగుతామని స్పష్టం చేశారు.

సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా అయిన కా॥ చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీలకు భూమిపై హక్కులు కల్పిస్తామని, అందుకే అటవీ హక్కుల చట్టం తెచ్చామని బొంకిన ప్రభుత్వాలు నేడు అందుకు విరుద్ధంగా భూములు లాక్కోవడానికి కుట్ర చేస్తున్నాయని అన్నారు. అటవీ శాఖ దాడులు నిలిపివేసి ఆదివాసీలు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 40 సంవత్సరాలుగా విప్లవకారుల పోరాటం వల్లనే పేదల భూములు దక్కాయని పేర్కొన్నారు. దీని వెనక అనేక మంది త్యాగాలు ఉన్నాయని గుర్తు చేశారు. భూములు కాపాడుకోవడానికై, భూమిపై హక్కులు సాధించడానికై ప్రతిఘటనా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాపంథా సహసంపాదకులు కా॥ కె. గోవర్ధన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఇంకా తెలంగాణాను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నాడన్నారు. కోస్తాంధ్ర దోపిడీ దారులు ప్రయోజనాల కొరకే పోలవరం ప్రాజెక్టును అంత పెద్దగా కడుతున్నారని అన్నారు. 276 ఆదివాసీ గ్రామాలను, 2 లక్షల మంది ఆదివాసీలను ముంచుతున్న పోలవరంను ప్రతిఘటించాలని, ఆంక్షలు లేని తెలంగాణను సాధించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ వి. సంధ్య మాట్లాడుతూ విప్లవ రాజకీయాల వెనక ప్రజలు లేరని ప్రచారం చేస్తున్న కొంత మందికి ఈ సభ చెంపపెట్టని అభివర్ణించారు. సమాజంలో అట్టడుగు గల బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికై ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని సక్రమంగా అమలు చేయటం ద్వారా భూస్వాములు, పెత్తందార్లు షెడ్యూలు ప్రాంతంలోని భూములు కాజేయకుండా కట్టడి చేయాలన్నారు. ఆంక్షలు లేని తెలంగాణాకై పోరాడాలన్నారు.

సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి కా॥ గౌని ఐలయ్య మాట్లాడుతూ బయ్యారం ఇనుపరాయిని విశాఖకు తరలించే జివోను రద్దు చేయాలని, ఉపాధి, ఉద్యోగాలు, ఈ ప్రాంత అభివృద్ధితో కూడి విధంగా బయ్యారంలో ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు.

ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కా॥ జె. సీతారామయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బీడీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. చట్టవిరుద్ధంగా చేసిన మామిడి గుండాల గ్రామ సభ తీర్మానాన్ని రద్దు చేసి ఖనిజ దోపిడీని నివారించాలని కోరురు.

ఇంకా ఈ సభలో ఎఐకెఎంఎస్ రాష్ట్ర కోశాధికారి కా॥ జడ సత్యనారాయణ, సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కా॥ ఎం. గిరి, గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి కా॥ బి. రమేష్, ఇఫ్టూ జిల్లా కోశాధికారి కా॥ ఎల్. విశ్వనాథం, ఎఐకెఎంఎస్ కొత్తగూడెం డివిజన్ అధ్యక్షుడు కా॥ కొమరం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కా॥ యదల్లపల్లి సత్యం, జిల్లా నాయకుడు కా॥ భూక్య లక్ష్మణ్‌లు ప్రసంగించారు.

సభ ప్రారంభంలో ప్రకాశం జిల్లా అరుణోదయ కళాకారులు అమరవీరులపై ప్రదర్శించిన నృత్యరూపం సభికులను కంటనీరు పెట్టించింది. ఖమ్మం, వరంగల్ జిల్లాల అరుణోదయ కళాకారుల నృత్య రూపాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఇంకా అరుణోదయ కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను అలరింప చేశాయి.

సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు డివిన్‌లోని బయ్యారం, గార్ల, సింగరేణి, గుండాల, ఇల్లందు, టేకులపల్లి, కొత్తగూడెం తదితర మండలాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో కదిలి వచ్చారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఒ.సి.పి., పోలవరం, ఖనిజ దోపిడీలకు వ్యతిరేకంగా తదితర సమస్యలపై రాబోయే రోజులలో ఉద్యమించానికి ఈ సభ మరోమారు మార్గనిర్దేశం చేసింది. రాయల వర్గం యొక్క తప్పుడు రాజకీయాలను, విష ప్రచారాన్ని ఈ సభ తిప్పికొట్టింది. ముఖ్యంగా సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ వెనక ప్రజా పునాది లేదని రాయల వర్గం చేస్తున్న కుట్ర పూరిత ప్రచారాన్ని ఈ సభ పటాపంచలు చేసింది. జిల్లా ప్రజానీకానికి, ప్రత్యేకించి జిల్లా, రాష్ట్ర విప్లవ శ్రేణులకు పోరుగడ్డ ఇల్లందు ఒక సరయిన సంకేతాన్ని ఇచ్చింది.

Published by M. Narayana Swamy, Publisher, Printer and owner from H.No. 1-9-295/11/4, 7th line, Maseedu Road, Vidyanagar, Hyderabad-44 and Printed at Navya Printers, Badam Sohna Apartments, Raj Bhavan Road, Hyderabad (A.P) Editor : M. Narayana Swamy.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M322
పుస్తకం పేరు	ప్రజాపంథా
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	13
పెద్ద సైజ పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	No
తయారు చేసినది	Priyanka
పేజీలు విడదీసినది	Priyanka
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	amrutha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good